

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

## కరీంనగర్

పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల

ఆదివారం 15 ఫిబ్రవరి 2026 | 14 పేజీలు





## కరీంనగర్ మేయర్ పీఠంపై...

# తీవ్ర ఉత్కంఠ

- మ్యాజిక్ ఫిగర్ కోసం క్యాంపు రాజకీయాలు...
- ప్రత్యర్థి పార్టీలకు బండి సంజయ్ హెచ్చరిక
- కీలకంగా మారనున్న ఎక్స్అఫీషియో ఓటు

సూర్య కరీంనగర్ ప్రతినిధి

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాల అనంతరం మేయర్ పీఠం కోసం రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. మొత్తం 66 డివిజన్లలో బీజేపీ 30 స్థానాలు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, మేయర్ పదవికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్ 33కు ఇంకా మూడు స్థానాలు తక్కువగా ఉన్నాయి. కాంగ్రెస్ 14, బీఆర్ఎస్ 9, ఎంఐఎం 3, ఏఐఎఫ్‌బీ 2, స్వతంత్రులు 8 స్థానాలు దక్కించుకోవడంతో కార్పొరేషన్‌లో సంఖ్యాబలం చుట్టూ రాజకీయ ఉత్కంఠ నెలకొంది. 2లో

# దారులన్నీ ఎములాడ వైపే..



- మహా శివరాత్రి జాతరకు భీమన్న ఆలయం ముస్తాబు
- ఈవో రమాదేవి పర్యవేక్షణలో విస్తృత సదుపాయాలు
- 2-3 లక్షల మంది భక్తులకు సౌకర్యాలు
- టీటీడీ పట్టు వస్త్రాల సమర్పణ
- భక్తుల సౌకర్యార్థం డిజిటల్ సేవలు
- వాట్సాప్‌తో భక్తులకు సేవల సమాచారం



సూర్య వేములవాడ

వేములవాడ పట్టణంలో శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం మహాశివరాత్రి జాతరకు ముస్తాబైంది. వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన భీమేశ్వరాలయంలో జరగనున్న ఈ జాతర సందర్భంగా భక్తులకు సమగ్ర సౌకర్యాలు కల్పించేందుకు ఈవో రమాదేవి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. 2లో

## జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్

# రేసులో నలుగురు





- ఇద్దరు ఎమ్మెల్యే వర్గీయులు
- మరో ఇద్దరు మాజీ మంత్రి మద్దతుదారులు
- వేరువేరుగా క్యాంపుకు తరలిన కాంగ్రెస్ కౌన్సిలర్లు





సూర్య జగిత్యాల ప్రతినిధి

జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ పదవికి నలుగురు కౌన్సిలర్లు పోటీ పడుతున్నట్టు తెలుస్తోంది. చైర్ పర్సన్ (మిగతా 2లో)





















# కరీంనగర్ మేయర్ పీఠంపై ... తీవ్ర ఉత్కంఠ

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**




విపక్ష పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పరస్పర సహకారంతో మేయర్ పీఠాన్ని దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయనే ప్రచారం నగర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ఈ మూడు పార్టీలకు కలిపి 26 మంది సభ్యులు ఉండగా, మిగిలిన సంఖ్యను స్వతంత్రులు మరియు చిన్న పార్టీల మద్దతుతో పూర్తి చేసుకునే దిశగా క్యాంపు రాజకీయాలు జరుగుతున్నాయన్న సమాచారం వినిపిస్తోంది. దీంతో కార్పొరేషన్ రాజకీయాలు మరింత వేడెక్కాయి. ఈ పరిణామాలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఘాటుగా స్పందించారు. "కరీంనగర్ అభివృద్ధే లక్ష్యంగా పనిచేశాం. ప్రజా తీర్పు మా వెంటే ఉంది. 100 శాతం మేయర్ పీఠం బీజేపీదే" అని స్పష్టం చేశారు. విపక్షాలపై తీవ్ర విమర్శలు చేస్తూ, "అడ్డదారులు తొక్కే ప్రయత్నాలు చేస్తే కరీంనగర్ నుంచే రాజకీయ యుద్ధం ప్రారంభమవుతుంది. బీజేపీ కార్యకర్తల దమ్ము ఏమిటో చూపిస్తాం" అని హెచ్చరించారు. బీజేపీ వర్గాలు స్వతంత్రులు, ఇతర సభ్యుల మద్దతును సమీకరించే ప్రయత్నాల్లో ఉండగా, విపక్ష కూటమి కూడా సంఖ్యాబలం కోసం చురుగ్గా కదులుతోందని సమాచారం. మేయర్ ఎన్నిక వరకు ఈ రాజకీయ కదలికలు మరింత ఉత్కంఠభరితంగా కొనసాగే అవకాశం కనిపిస్తోంది. నగర అభివృద్ధి, పాలన స్థిరత్వం అనే అంశాలు ఇప్పుడు ప్రధాన చర్చగా మారాయి. ప్రజా తీర్పును గౌరవిస్తూ స్థిరమైన పాలన అందించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతుండగా, చివరకు మేయర్ పీఠం ఎవరికి దక్కుతుందన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. కరీంనగర్ కార్పొరేషన్‌లో ఈ సమీకరణాలు రాష్ట్ర రాజకీయాలకూ సంకేతాలివ్వనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

**- కరీంనగర్ మేయర్ ఎన్నికలో కీలకంగా మారనున్న ఎక్స్‌అఫీషియో ఓటు**

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్ పీఠంపై ఉత్కంఠ కొనసాగుతున్న వేళ, ఎక్స్‌అఫీషియో సభ్యుల ఓటు కీలకంగా మారనుంది. కార్పొరేటర్ల సంఖ్యలో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ లేకపోవడంతో మేయర్ ఎన్నికలో ప్రతి ఓటు ప్రాధాన్యం సంతరించుకుంది. ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ఓటు హక్కు వినియోగించనున్న నేపథ్యంలో వారి వైఖరి తుది ఫలితంపై ప్రభావం చూపే అవకాశముంది. ప్రధాన పార్టీలన్నీ సంఖ్యాబలం సమీకరణాలపై దృష్టి సారించడంతో పాటు ఎక్స్‌అఫీషియో ఓట్ల కోసం వ్యూహాత్మకంగా కదులుతున్నాయి. మేయర్ ఎన్నిక తేదీ దగ్గరపడుతున్న కొద్దీ రాజకీయ చర్చలు మరింత వేడెక్కుతున్నాయి. చివరకు ఎక్స్‌అఫీషియో ఓటు ఏ వైపు మొగ్గుతుందన్నదే కరీంనగర్ కార్పొరేషన్ పాలన దిశను నిర్ణయించనుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.



## మహాశివరాత్రి వేడుకలకు సర్వం సిద్ధం

**సూర్య సిరిసిల్ల టౌన్**

సిరిసిల్ల శివనగర్ లోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి వేడుకలకు సర్వం సిద్ధమైంది ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో అతి పురాతనమైన శివాలయం శివనగర్ లో వేలాదిమంది భక్తుల కొంగు బంగారంగా ఉన్న శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో నేటి నుండి రెండు రోజులపాటు జరిగే మహాశివరాత్రి పర్వదినానికి అన్ని ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులకు సకల సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం నాలుగు గంటల నుండి నిత్య పూజ కార్యక్రమం, 6 గంటల నుండి నిరంతర జలాభిషేకాలు జరగనున్నాయి. సాయంత్రం 6 గంటలకు అఖండ దీపారాధన, స్వామివారి దర్శనాలు, జాగరణ, అఖండ నామస్మరణ, భజనలు జరుగుతాయి. రాత్రి 12 గంటలకు లింగోద్భావము, రుద్రాభిషేకము, బిల్వర్చన ఘనంగా జరగనుంది. సోమవారం మధ్యాహ్నం శివపార్వతుల కళ్యాణం అత్యంత వైభవంగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతరం మహా అన్నప్రసాద కార్యక్రమం జరుగుతుందని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఇట్టి కార్యక్రమాన్ని దిగ్విజయవంతం చేయాలని ఆలయ అర్చకులు గోషికొండ హనుమంతు పంతులు, ఆలయ కార్యవర్గ సభ్యులు తెలిపారు.

# జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ రేసులో నలుగురు

(మొదటి పేజి తరువాయి)



పదవి బిసి మహిళకు కేటాయించగా 29 వార్డు నుండి గెలుపొందిన తోపారపు లావణ్య రజినీకాంత్, 40 వార్డ్ నుండి అడువాల జ్యోతి లక్ష్మణ్, 43 వ వార్డు నుండి సమిండ్ల వాణి శ్రీనివాస్, 50 వ వార్డు నుండి ములాస్తం లావణ్య మహేష్ లు పోటీలో ఉన్నారు. వీరిలో అడువాల జ్యోతి లక్ష్మణ్ ఎమ్మెల్యే, మాజీ మంత్రిని సమన్వయం చేసుకుని చైర్ పర్సన్ కైవసం చేసుకునే ప్రయత్నంలో ఉండగా సమిండ్ల వాణి శ్రీనివాస్ ను ఎమ్మెల్యే ప్రతిపాధించినట్టు సమాచారం కాగా తోపారపు లావణ్య రజినీకాంత్, ములాస్తం లావణ్య మహేష్ లకు మాజీ మంత్రి జీవన్ రెడ్డి సపోర్ట్ చేసినట్టు తెలిసింది. ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ వెంట 18 మంది కౌన్సిలర్లు ఉండగా, జీవన్ రెడ్డికి 20 మంది కౌన్సిలర్లు మద్దతు తెలుపుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. అయితే జీవన్ రెడ్డి ప్రతిపాధించిన ఇద్దరు కౌన్సిలర్లు కొత్తవారు కావడం వలన వీరికి చైర్ పర్సన్ పదవి కట్టబెట్టడానికి మొగ్గుచుపే అవకాశాలు తక్కువగా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఎమ్మెల్యే ప్రతిపాధించిన ఇద్దరు కౌన్సిలర్లలో అడువాల జ్యోతి లక్ష్మణ్ తాజా మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కాగా సమిండ్ల వాణి శ్రీనివాస్ గతంలో చైర్ పర్సన్ స్థానాన్ని ఆశించి మెజారిటీ లేక బంగపడ్డారు. ఈ నేపథ్యంలో సానుబూతి వర్క్ ఔట్ అయితే సమిండ్ల వాణి శ్రీనివాస్, లేదంటే పార్టీ పటిష్టతకు కృషి చేసి, చైర్ పర్సన్ గా 11 నెలలు పని చేసి గాడి తప్పిన మున్సిపాలిటీని గాడిలో పెట్టిన నాయకురాలుగా గుర్తింపు పొందిన అడువాల జ్యోతి లక్ష్మణ్ చైర్ పర్సన్ గా ఎన్నికయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

**- క్యాంపుకు తరలిన కౌన్సిలర్లు**

ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ 18 మంది కౌన్సిలర్లతో క్యాంపుకు బయలుదేరగా మాజీ మంత్రి జీవన్ రెడ్డి శనివారం 20 మంది కౌన్సిలర్లతో క్యాంపుకు తరలి వెళ్లారు. మంత్రులు ఉత్తం కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు జగిత్యాల చైర్ పర్సన్ ఎన్నికలో ఆచి తూచి వ్యవహరిస్తున్నట్టు తెలుస్తుంది. నేను బి ఆర్ ఎస్ ఎమ్మెల్యే నే అని ప్రకటించుకున్న డా సంజయ్ కుమార్ మద్దతిస్తున్న ఇద్దరిలో సమిండ్ల వాణి శ్రీనివాస్ బి ఆర్ ఎస్ పార్టీకి చెందిన వారు కాగా ఇటీవలే ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి కాంగ్రెస్ టికెట్ దక్కించుకున్నారు. ఇప్పుడు చైర్ పర్సన్ పదవి సమిండ్ల వాణి శ్రీనివాస్ కు కేటాయిస్తే మెజారిటీ స్థానాలు కాంగ్రెస్ పార్టీకి ఉండి, అందులో చైర్ పర్సన్ పదవికి అర్హులు ఉన్నప్పటికీ బి ఆర్ ఎస్ నుండి వచ్చిన వారికి ఇస్తే పార్టీ అపక్యాతి మూట గట్టుకునె ప్రమాదం ఉన్నట్టు చర్చ కొనసాగుతుంది. ఈ క్రమంలో అడువాల జ్యోతి లక్ష్మణ్ కు లైన్ క్లియర్ అయ్యే అవకాశాలు లేకపోలేదని పలువురు బావిస్తున్నారు.

# నేడు మహా జ్ఞాన జాగరణం

**సూర్య, హుజురాబాద్**

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 15వ తేది ఆదివారం హుజురాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ హాల్ లో మహా ధ్యాన జాగరణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ మాస్టర్ చింతా అనిల్ కుమార్ అన్నారు. ఆదివారం సాయంత్రం ఐదు గంటల నుండి సోమవారం ఉదయం 5 గంటల వరకు సిటి సెంట్రల్ ఫంక్షన్ హాల్ లో బ్రహ్మవిద్య రిష్ట జక్కాపద్మ సహస్రనామ ధ్యానం పై వివరిస్తారని ఆయన తెలిపారు. అధిక సంఖ్యలో ధ్యాన సభ్యులు హాజరై మహా జ్ఞాన జాగరణలో పాల్గొనాలని ఆయన కోరారు.

# దారులన్నీ ఎములాడ వైపే..

**సూర్య, వేములవాడ:**

**- భక్తుల అంచనా..**

మూడు రోజుల పాటు సుమారు 2 నుంచి 3 లక్షల మంది భక్తులు విచ్చేస్తారని అంచనా వేస్తున్నారు. ఇందుకు అనుగుణంగా 2 నుంచి 2.5 లక్షల వరకు లడ్డు ప్రసాదాలు సిద్ధం చేస్తున్నారు.

**- భక్తుల కోసం ఏర్పాట్లు**

భక్తుల కోసం 3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో టెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. త్రాగునీటి కోసం 'రాజన్న జల ప్రసాదం' పేరుతో 6 ప్రధాన కేంద్రాలు, 30 ప్రాంతాల్లో నీటి పంపిణీ ఏర్పాటు చేశారు. ట్రాలీ ఆటోల ద్వారా కూడా నీటి సరఫరా చేయనున్నారు. 440 షవర్స్‌ను ఏర్పాటు చేసి జల్లు స్నానాలకు సౌకర్యం కల్పించారు.

**- ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు**

కళ్యాణకట్ట పక్కన ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేయడంతో పాటు సాయి రక్ష, ఐబీపీ గోదాం, బాలనగర్, ఏక్ట్ తదితర ప్రాంతాల్లో ఓపెన్ ప్లేస్ పార్కింగ్ సదుపాయాలు కల్పించారు. దాతల సహకారంతో లక్ష వరకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయనున్నారు. ఫిబ్రవరి 14, 15 తేదీలలో ఉదయం 7 గంటల నుంచి భక్తులకు నిరంతరా యంగా అల్పాహారం అందించనున్నారు.

**- ప్రసాద కేంద్రాలు**

ప్రసాదం కౌంటర్లను ఆలయం ఎగ్జిట్ వద్ద ఏర్పాటు చేస్తున్నారు. .

విద్యుత్ కాంతుల వెలుగుల్లో ఆలయాలు

అన్ని ఆలయాలకు ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణ, ప్రధాన దేవాలయం, అనుబంధ ఆలయాలకు పుష్పాలంకరణ చేపడుతున్నారు.

**- మే ఐ హెల్ప్ యూ కేంద్రం**

భక్తుల సందేహాలకు సమాధానం ఇవ్వడానికి దేవస్థాన పరిసరాల్లో 7 " మే ఐ హెల్ప్ యూ " కేంద్రాలు ఏర్పాటు చేశారు.

**- ఎల్ఈడి స్క్రీన్లపై పర్యవేక్షణ**

అన్ని శాఖల సమన్వయంతో కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా ఎల్ ఈ డి స్క్రీన్లపై పర్యవేక్షణ నిర్వహించనున్నారు.



**- భక్తులకు సదుపాయాలు**

ఉద్యోగులకు భోజనం, వసతి సదుపాయాలు కల్పిస్తున్నారు. ఫిబ్రవరి 14 నుంచి 16 వరకు శివార్చన వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

**- భక్తుల సౌకర్యార్థం డిజిటల్ సేవలు**

భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక వాట్సాప్ సేవను కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. 8736936969 నంబర్‌కు "హై" అని మెసేజ్ చేయడం ద్వారా ఆలయ సేవల వివరాలు పొందవచ్చని ఈవో రమాదేవి తెలిపారు.

పట్టు వస్త్రాలు సమరించనున్న మంత్రి పొన్నం ఫిబ్రవరి 15 ఉదయం 8 గంటలకు తెలంగాణ ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టు వస్త్రాల సమర్పణ జరగనుంది. బీసీ వెల్ఫేర్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ శాఖ మంత్రి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.

**- టీటీడీ పట్టు వస్త్రాల సమర్పణ**

మహాశివరాత్రి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున డిప్యూటీ ఈవో లోకనాథం ఆధ్వర్యంలో అధికారులు భీమేశ్వర స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. దేవాలయానికి చేరుకున్న టీటీడీ అధికారులకు ఆలయ వర్గాలు పూలమాలలతో స్వాగతం పలికాయి. అనంతరం గర్భగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ గత 28 సంవత్సరాలుగా టీటీడీ తరఫున వేములవాడ దేవస్థానానికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఈవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com



# చైర్మన్ రేసులో నలుగురు మహిళలు

**- సిరిసిల్ల మున్సిపాలిటీ చైర్మన్ ఎంపికపై తీవ్ర ఉత్కంఠ**

**- క్యాంపు రాజకీయాలలో కౌన్సిలర్లు - అనుభవజ్ఞులకా? కొత్త వారికా?**

**- అధినేత కేటీఆర్ అండ దండలు ఎవరికో...**

**సూర్య రాజన్న సిరిసిల్ల**

మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ పూర్తి అవ్వడంతో సిరిసిల్ల మున్సిపల్ చైర్మన్ ఎన్నికపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈనెల 13న జరిగిన కౌంటింగ్‌లో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని మెజారిటీ కౌన్సిలర్ స్థానాలను టీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎవరు చైర్మన్ అవుతారు అన్న విషయంపై ఊహాగానాలు పట్టణంలో జోరందుకుంటున్నాయి. పద్మశాలీల కంచుకోటగా ఉన్న సిరిసిల్లలో, పద్మశాలి సామాజిక వర్గం నుండి కౌన్సిలర్‌గా ఎన్నికై చైర్మన్ పదవిని ఆశిస్తున్న వారిలో నలుగురి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. మొదటి నుండి బిఆర్ఎస్ పార్టీకి విధేయులుగా ఉంటూ, గత పాలక వర్గంలోను పని చేసిన అనుభవం ఉన్న నాయకులుగా వీరి పేర్లు ప్రధానంగా చర్చకు వస్తున్నాయి.

**- మరోసారి అవకాశం దక్కేనా...**



ముఖ్యంగా పట్టణంలోని మూడవ వార్డు నుండి గెలు పొందిన మాజీ మున్సిపల్ చైర్మన్ జిందం కళాచక్రపాణి పేరు రేసులో ప్రముఖంగా వినిపిస్తుంది. గతపాలక వర్గంలో చైర్మన్ గా పని చేసిన జిందం కళ భర్త జిందం చక్రపాణి సిరిసిల్ల పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షులుగా సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్నారు. అందరితో కలిసిపోయే నైజం ఉన్న చక్రపాణి సిరిసిల్ల పట్టణంలో పార్టీ అన్ని కార్యక్రమాల్లో ముందు ఉండి నడిపిస్తున్నారు. ఆర్థికంగా మంచి స్థానంలో ఉండడంతో పాటు అన్ని వర్గాలకు అందుబాటులో ఉండే వ్యక్తిగా జిందం చక్రపానికి పేరు ఉంది. దీంతో మరోసారి సిరిసిల్ల మున్సిపల్ చైర్మన్ గా జిందం కళా చక్రపానికి అవకాశం దక్కుతుందని ఆమె వర్గం నాయకులు భరోసాతో ఉన్నారు.

**- వైస్ చైర్మన్ అనుభవానికి చైర్మన్ పీఠం దక్కేనా....**



మరో వైపు గతపాలక వర్గంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గా పని చేసిన మంచే శ్రీనివాస్ సతిమణి, ప్రస్తుత 30వ వార్డు కౌన్సిలర్‌గా గెలుపొందిన మంచే రేణుక పేరు కూడా చైర్మన్ రేసులో బలంగా వినిపిస్తోంది. నేతన్నల ఖిల్లాగా, వస్త్ర వ్యాపారానికి కేంద్రంగా ఉన్న సిరిసిల్ల పట్టణంలో అనుభవం ఉన్న వస్త్ర వ్యాపారిగా మంచే శ్రీనివాస్ కొనసాగుతున్నారు. ఆర్థికంగా బలంగా ఉండి,సిరిసిల్ల పట్టణంలోని పద్మశాలీ సామాజిక వర్గానికి, నేత కార్మిక కుటుంబాలకు మంచి చేసే అనుభవం ఉన్న నాయకునిగా మంచే శ్రీనివాస్ పేరు సుపరిచితం. అందుకే ఈసారి మంచే శ్రీనివాస్ సతీమణి మంచే రేణుకకు చైర్ పర్సన్ పీఠం దక్కే అవకాశాలు ఉన్నాయని మరో వర్గం భావిస్తోంది.

**- రాజకీయ కుటుంబానికి అదృష్టం వరించేనా....**



మరోవైపు సిరిసిల్ల పట్టణం గ్రామపంచాయతీ గా ఉన్న కాలం నుండి రాజకీయాల్లో కొనసాగుతున్న గుండ్లపెల్లి కుటుంబం నుంచి వచ్చిన 17వ వార్డు కౌన్సిలర్ గుండ్లపల్లి నీరజ పూర్ణచందర్ కూడా చైర్మన్ రేసులో ఉన్నారు. గత పాలకవర్గంలోనూ కౌన్సిలర్గా పనిచేసిన నీరజ పూర్ణచందర్ ఈసారి కూడా మంచి మెజారిటీతో గెలుపొందారు. సిరిసిల్ల గ్రామపంచాయతీకి నీరజ పూర్ణచందర్ మామ గుండ్లపల్లి భూమయ్య సర్పంచిగా పనిచేయగా, ఆమె అత్త గుండ్లపల్లి సరోజన సిరిసిల్ల మున్సిపల్ చైర్మన్‌గా కూడా పనిచేశారు. నీరజ భర్త గుండ్లపల్లి పూర్ణచందర్ కూడా ఒక పర్యాయం మున్సిపల్ కౌన్సిలర్ గా సేవలందించారు. ప్రస్తుతం సిరిసిల్ల మున్సిపల్ స్థానం జనరల్ మహిళకు రిజర్వు కావడంతో, 17వ వార్డు జనరల్ స్థానమైనప్పటికీ గుండ్లపల్లి నీరజ పూర్ణచందర్ పోటీ చేసి గెలుపొందారు. దశాబ్దాలుగా సిరిసిల్ల పట్టణ ప్రజలకు సేవలందిస్తున్న సుదీర్ఘ రాజకీయ కుటుంబంగా పేరున్న గుండ్ల పెల్లి నీరజ పూర్ణ చందర్ మున్సిపల్ చైర్మన్ పీఠం కోసం గట్టిగానే ప్రయత్నిస్తున్నారు.

**- దార్ణం అరుణకు అవకాశం దక్కేనా....**



కాగా వరుసగా రెండు సార్లు మున్సిపల్ కౌన్సిలర్గా ఎన్నికైన దార్ణం అరుణ కూడా మున్సిపల్ చైర్మన్ రేస్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. దార్ణం అరుణ భర్త లక్ష్మీనారాయణ ప్రస్తుతం సిరిసిల్ల సహకార విద్యుత్ సంస్థ సెస్ డైరెక్టర్గా కొనసా గుతున్నారు. సిరిసిల్ల ప్రాంతంపై మంచి పట్టున్న నేతగా ఈసారి ప్రజలకు మున్సిపల్ చైర్మన్గా సేవలందించే అవకాశం తనకు కల్పించాలని పార్టీ అధినేతను ఆమె అభ్యర్థిస్తున్నట్లు సమాచారం. ఈ కోవలో మున్సిపల్ చైర్మన్ పీఠంపై ఉన్న ఉత్కంఠ తొలగిపోవాలన్నా, పార్టీ అధినేత కేటీఆర్ అండదండలు ఎవరికన్న విషయం తెలియాలన్నా, సోమవారం వరకు ఆగాల్సిందే. ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా అంతిమ నిర్ణయం మాత్రం అధినేత కేటీఆర్ చేతిలోనే ఉందన్నది జగమెరిగిన సత్యమే.

# మున్సిపల్ వైస్ చైర్మన్ తీవ్ర ఉత్కంఠ

**- యువ నాయకుడు దార్ల సందీప్ వైపే మొగ్గు?**

**- పద్మశాలి కోటాలో యువ నాయకుడికి లక్ చిక్కేనా.. కేటీఆర్ నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ!**

**సూర్య రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రమైన సిరిసిల్ల మున్సిపాలిటీలో ఎన్నికల నగారా ముగిసి, ఫలితాలు వెలువడటంతో ఇప్పుడు అందరి దృష్టి 'వైస్ చైర్మన్' పీఠంపై పడింది. బిఆర్ఎస్ పార్టీ మరో సారి స్పష్టమైన ఆధిక్యాన్ని కనబర్చిన నేపథ్యంలో, పాలకవర్గ ఎంపికపై ఊహాగానాలు జోరందుకున్నాయి. ముఖ్యంగా వైస్ చైర్మన్ పదవి రేసులో 34వ వార్డు కౌన్సిలర్ దార్ల సందీప్ పేరు బలంగా వినిపిస్తోంది.

**- సామాజిక సమీకరణాలే కీలకం**

సిరిసిల్ల పట్టణంలో అత్యధిక జనాభా కలిగిన పద్మశాలి సామాజిక వర్గానికి సముచిత స్థానం కల్పించడం ఇక్కడ ఎప్పటి నుంచో వస్తున్న ఆనవాయితి. ఈసారి చైర్మన్ పదవి 'జనరల్ మహిళ'కు రిజర్వ్ కావడంతో, వైస్ చైర్మన్ పదవిని పురుష అభ్యర్థికి కేటాయించే అవకాశం ఉంది. గత సంప్రదాయాలను గౌరవిస్తూ పద్మశాలి సామాజిక వర్గానికే ఈ పదవి దక్కాలని ఆ వర్గ నేతలు కోరుతున్నారు. ప్రస్తుతం గెలిచిన వారిలో దార్ల సందీప్ తో పాటు 25వ వార్డు కౌన్సిలర్ బింగి రాంబాబు కూడా పద్మశాలి వర్గం నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నారు.



**- సందీప్‌కు కలిసివచ్చే అంశాలేంటి?**

మున్సిపల్ వైస్ చైర్మన్ రేసులో దార్ల సందీప్ ముందువరుసలో ఉండటానికి ప్రధాన కారణాలు ఆయనకున్న రాజకీయ నేపథ్యం మరియు పార్టీ పట్ల విధేయత. దార్ల సందీప్ కుటుంబం మున్సిపల్ రాజకీయాల్లో పట్టు సాధించింది. గతంలో ఆయన భార్య కీర్తన కౌన్సిలర్గా సేవలు అందించగా, ఇప్పుడు సందీప్ స్వయంగా 34వ వార్డు నుండి గెలుపొంది కుటుంబ పరంగా హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేశారు. మరోవైపు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నమ్మకస్తుడిగా, యువ నాయకుడిగా సందీప్‌కు మంచి గుర్తింపు ఉంది. పార్టీ కేడర్‌లో ఆయనకు ఉన్న పట్టు హైకమాండ్‌కు సానుకూల అంశంగా మారింది. తన వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, సమర్థవంతమైన నాయకుడిగా పేరు తెచ్చుకోవడం సందీప్‌కు పెద్ద ప్లస్ పాయింట్‌గా మారింది.

**- కేటీఆర్ నిర్ణయంపైనే సర్వత్రా ఆసక్తి**

సిరిసిల్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించే కేటీఆర్, ఈసారి మున్సిపల్ పీఠాన్ని ఎవరికి అప్పగిస్తారనేది చర్చనీయాంశంగా మారింది. పద్మశాలి సామాజిక వర్గానికి పెద్దపీట వేస్తూ, యువ నాయకత్వానికి అవకాశం ఇవ్వాలని భావిస్తే దార్ల సందీప్ వైపు మొగ్గు చూపే అవకాశాలు మెండుగా ఉన్నాయి. వార్డు కౌన్సిలర్‌గా గెలిచిన సందీప్, మున్సిపల్ వైస్ చైర్మన్‌గా పదోన్నతి పొందుతారా లేదా అనేది తేలాలంటే సోమవారం వరకు రోజులు వేచి చూడాల్సిందే.

## రాష్ట్రస్థాయి సీఎం కప్‌కు తైక్వాండో బాలికల ఎంపిక

**సూర్య కోనరావుపేట**



రాష్ట్రస్థాయి సీఎం కప్ టోర్నమెంట్ తైక్వాండో విభాగంలో బాలికలు ఎంపికైనట్లు కోచ్ ఎం. శ్రీనివాస్ తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని స్టేడియంలో నిర్వహించిన సీఎం కప్ టోర్నమెంట్‌లో జిల్లా స్థాయి తైక్వాండో పోటీలలో కనగర్తి జడ్పీ హైస్కూల్‌కి చెందిన పుట్ట శరణ్య,మోతె వైష్ణవిలు పాల్గొన్నారు. జూనియర్ విభాగంలో తైక్వాండో కోయర్గిలో పాల్గొని బంగారు పతకాలు సాధించారు. ఈ నెల 18,19న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని కోచ్ తెలిపారు. బంగారు పతకాలు సాధించిన బాలికలను జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి రాందాస్, హెచ్ఎం వినోద్ కుమార్, సర్పంచ్ స్వామి దాస్‌లు అభినందించారు.

## అంగన్వాడీ చిన్నారులకు యూనిఫామ్స్‌లను సర్పంచ్ పంపిణీ

**సూర్య, ఇల్లంతకుంట**



మండలంలోని వెలిజీపూర్ గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు సర్పంచ్ నాయిని నవీన్ కుమార్ యూనిఫామ్‌లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవంపల్లి సత్యనారాయణ సహకారంతో ప్రభుత్వం చిన్నారుల సంక్షేమం కోసం తీసుకుంటున్న పలు సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా అంగన్వాడి పిల్లలకు ఉచిత యూనిఫాంల పంపిణీ కార్యక్రమం చేపట్టడం గొప్ప విషయం అన్నారు. ఈ యూనిఫాం పంపిణీ కార్యక్రమం ద్వారా పిల్లల్లో సమానత్వ భావన పెంపొందించడంతో పాటు, విద్యపై ఆసక్తి పెరుగుతుందన్నారు. తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గించే మంచి కార్యక్రమమని కొనియాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం ప్రజలకు పూర్తిగా చేరేలా గ్రామపంచాయతీ తరఫున కృషి చేస్తామని సర్పంచ్ నవీన్ కుమార్ హామీ ఇచ్చారు. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను అంగన్వాడి కేంద్రాలకు క్రమం తప్పకుండా పంపించి, ప్రభుత్వం అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని కోరారు. గ్రామ చిన్నారులు ఆరోగ్యంగా, విద్యావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, వార్డు సభ్యులు గొల్ల కమిటీ మల్లవ్వ శంకర్, సంగెం ముత్తవ్వ, బొల్లారం ప్రసన్న కుమార్, అంగన్వాడీ టీచర్ మంజుల, సహాయకురాలు సత్తవ్వలు పాల్గొన్నారు.

## వరుసగా రెండవసారి చేతిరాతలో రాష్ట్ర ఉత్తమ పాఠశాలగా నవత

**సూర్య చందుర్తి**



అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన లుసిడ చేతిరాతలో చందుర్తి మండల కేంద్రంలోని నవత ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఈసారి కూడా ఉత్తమ పాఠశాల అవార్డు పొందినది. గత డిసెంబర్ నెలలో అక్షరా ఫౌండేషన్ అధినేత మీరజ్ మహమ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించిన చేతిరాత పరీక్షలో దాదాపు 30 వేల మంది పిల్లలు పాల్గొనగా, నవత పాఠశాల నుండి 140 మంది పిల్లలు పరీక్షకు హాజరయ్యారు. అందులో నాలుగు సౌత్ ఇండియా సూపర్ స్టార్, 19 స్టేట్ అవార్డ్స్, 46 స్పార్క్ అవార్డ్స్, 65 సర్టిఫికెట్ అవార్డ్స్ పొందడం జరిగింది. ఇట్టి అవార్డుల ప్రధానోత్సవం హైదరాబాదులోని గాంధీభవన్ ప్రకాశం హాల్లో నిర్వహించగా ప్రొఫెసర్ కోదండరాం చేతుల మీదుగా అవార్డు అందుకోవడం జరిగింది. గత ఏడాది తొ పాటు ఈ ఏడాది వరుసగా రెండుసార్లు రాష్ట్ర ఉత్తమ పాఠశాల అవార్డు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ప్రొఫెసర్ కోదండరాం పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజును ప్రశంసించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ అభినందించారు.

## భక్తుల కొంగుబంగారం శ్రీలక్ష్మి నరసింహస్వామి దేవాలయం

**సూర్య వెల్గటూర్**

జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కిషన్రావు పేట గ్రామంలోని గుట్టపైన వెలసిన దివ్యక్షేత్రం. గుట్టపై భాగాన రెండుగా చిలిన బండ సొరంగంలో బండ రాయిపై స్వయంభూగా వెలసిన శ్రీ నాగపెల్లి లక్ష్మీ నరసింహుడు కోలువుతీరి కొలిచిన భక్తులకు కొంగుబంగారమై నీరాజనాలందుకుంటున్నారు. భక్తుల కొంగుబంగారంగా పేరొందిన ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రతియేటా మార్చి నెలలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కనుల పండువగా ఐదు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఒక్కోరోజు ఒక్కో కార్యక్రమం ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహిస్తారు. స్వామివారి కళ్యాణమహోత్సవానికి సైతం మండల, ఇతర జిల్లాలనుండి భారీగా భక్తులు తరాలివస్తారు. వేలాదిమంది హాజరయ్యే ఈ బ్రహ్మోత్సవాలకు ఆలయ కమిటీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తారు. ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో మండలంలోని పలు గ్రామాల ప్రజలు నాగపెల్లి లక్ష్మీ నరసింహ స్వామిని భక్తిశ్రద్దలతో దర్శించు కోని మొక్కులు చెల్లించి, వెంట



తెచ్చుకున్నా యటాలను ఎదిరించి కోసుకుని కుటుంబ సమేతంగా భోజనాలు చేస్తుంటారు. ఇక్కడి నాగపెల్లి లక్ష్మీ నరసింహుడి క్షేత్ర మహాత్యం మహా అద్భుతం,ఈ కొండ రాళ్ళకు చెట్టు కొమ్మలకు వందలకొద్దీ తేనెటీగలు ఉంటాయి. శుభ్రత పాటించకుండా భక్తులు ఆలయానికి వస్తే తేనెటీగలు శిక్షణ భటులుగా వారిని వెంబడించి ఆలయ ముఖద్వారం దాటించే వరకు వదలవు. స్వామివారికి మొక్కులు మొక్కి,ఆపదలు తీరిన తర్వాత మర్చిపోతే స్వామివారు వెంటనే గుర్తు చేస్తుంటారాట అనేది. భక్తుల ప్రగాఢ నమ్మకం. ఈ ఆలయంలో ప్రతి పౌర్ణమికి గిరిప్రదక్షణ ప్రత్యేకం. అరుణాచలం,సింహచలం ఆలయాల తరహాలోనే శ్రీనాగపెల్లి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో పౌర్ణమి రోజున ఆలయ ప్రాంగణంలో పులమాలలతో అలంకరించిన పల్లకిలో స్వామి వారి చిత్రపటాన్ని ఆశీనులు గావించి, అర్చకుల వేద మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం స్వామి వారి పల్లకితో భక్తులు భజనలు,జై శ్రీమన్నారాయణ స్మరణలు చేస్తూ కొండ చుట్టూ అష్టలింగల దర్శనంతో కూడిన ఆధ్యాత్మిక యాత్రలో పాల్గొంటే పాపాలు తొలగి, మానసిక ప్రశాంతత, కోరినా కోరికలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. దీంతో శ్రీనాగపెల్లి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా మరో యాదాద్రిగా వెలుగొందనుంది.



## ప్రజలిచ్చిన తీర్పును స్వాగతిస్తాం...

### - ప్రతిపక్షంలో కూడా అధికార పార్టీతో సమానంగా ఉన్నాం...
### - పొత్తుపై నిర్ణయం తీసుకోలేదు... - పార్టీ కౌన్సిలర్‌లకు విప్ జారీ చేసినం...
### - ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

**సూర్య మెట్‌పల్లి**

పట్టణ మున్సిపల్ ఎన్నికల్లో ఊహించని ఫలితాలు వచ్చాయని ఇలా ఫలితాలు వస్తాయని అనుకోలేదని ప్రజలు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపల్‌లో ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ మంచి ఫలితాలు సాధించామని పట్టణంలో బిఆర్ఎస్‌కు 6 సీట్లు వస్తె అధికార పార్టీ కాంగ్రెస్‌కు కూడా 6 వచ్చాయని,కేంద్రంలో అధికారంలో ఉన్న




బీజేపీకి 10 వచ్చాయని రెండు అధికార పార్టీల కంటే ప్రతిపక్షంలో ఉన్న బిఆర్ఎస్‌ను ప్రజలు ఆదరించారని అన్నారు. పట్టణంలో కొన్ని వార్డులలో అభ్యర్థులపై సానుభూతి కూడా పనిచేసిందని అయినప్పటికీ ఏ పార్టీ కూడా స్వతహాగా చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకునేంత మెజారిటీ లేదన్నారు. మున్సిపల్ చైర్మన్ కోసం ఏ పార్టీ కి మద్దతు తెలపాలో నిర్ణయం తీసుకోలేదని. తమ పార్టీ అభ్యర్థులకు స్వతహాగా ఎవరికి సపోర్ట్ చేయవద్దని విప్ జారీ చేసినట్లు తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల విజయం కోసం కార్యకర్తలు శ్రమించారని వారికి ధన్యవాదాలు తెలిపారు.గెలిచిన ప్రతి అభ్యర్థులు ప్రజలకు నిస్వార్థంగా సేవలను అందించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతి సమస్య పరిష్కారం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు ఉన్నారు.

## మున్సిపల్ చైర్మన్ పదవి కైవసం చేసుకుంటాం...

### - మైనారిటీలకు వైస్ చైర్మన్ ఇస్తాం - బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ రఘు

**సూర్య మెట్‌పల్లి**

మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ పదవిని కైవసం చేసుకుంటామని తమతో కలిసి వస్తె మైనారిటీలకు వైస్ చైర్మన్ పదవి ఇచ్చి గౌరవిస్తామని బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ రఘు అన్నారు.గత రెండు రోజుల క్రితం విడుదలైన మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ అభ్యర్థులు మెజార్టీ స్థానాలు కైవసం చేసుకున్న సందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పార్టీ అభ్యర్థుల గెలుపుతో మెట్‌పల్లి పట్టణానికి పూర్వ వైభవం వచ్చిందన్నారు. పట్టణంలో తమ అంచనా ప్రకారం 26 వార్డులకు 14 వార్డులు కైవసం చేసుకుంటామని అనుకున్నామని, కానీ పది స్థానాలు కైవసం చేసుకున్నామన్నారు. బీజేపీ గతంలో పట్టణానికి కంచుకోటగా ఉందని, ఇక్కడి నుండి సీనియర్ నాయకులు చెన్నమనేని విద్యాసాగర్ రావు 4 సార్లు ప్రాతి




నిధ్యం వహించారని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ వాదం ఉన్నప్పుడు రెండు దఫాలు కోరుట్ల నియోజకవర్గ వర్గ ప్రజలు బీఆర్ఎస్ కు మొగ్గ చూపారని, ఇప్పుడు మళ్లీ బీజేపీకి ప్రజలు మొగ్గ చూపుతున్నారన్నారు. మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ పదవిని సొంతం చేసుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఆధ్వర్యంలో పట్టణాన్ని స్మార్ట్ సిటీగా మార్చుకోవడానికి అవసరమైన ప్రణాళికతో ముందుకు వెళ్తామన్నారు. తెలంగాణలో మార్పు ఇక్కడి నుండే మొదలయిందని, త్వరలోనే తెలంగాణ వ్యాప్తంగా బీజేపీ హవా ఉంటుందని పేర్కొన్నారు. కాగా తమతో కలిసి పట్టణ మున్సిపల్ చైర్మన్ పదవిని సొంతం చేసుకోవడానికి సహకరించే మైనారిటీలకు వైస్ చైర్మన్ పదవి ఇస్తామని చెప్పారు. ఇప్పటి వరకు ఇతర ఏ పార్టీ కూడా మైనారిటీలకు వైస్ చర్మన్ పదవి ఇస్తామని చెప్పలేదని అన్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా గెలిచిన మైనారిటీ కౌన్సిలర్లు టచ్‌లో ఉన్నారని తెలిపారు. ధర్మపురి అరవింద్ నేతృత్వంలో తమకు సహకరించే మైనార్టీ కౌన్సిలర్ అభ్యర్థులకు వైస్ చైర్మన్ ఇస్తామని మాకు ఆదేశాలు ఇచ్చారన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో నమ్మకంతో అధిక స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించిన పట్టణ ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నామని, పట్టణ సమగ్రాభివృద్ధికి కలిసికట్టుగా పనిచేస్తామని అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు, పట్టణ ఎన్నికల ఇంచార్జీ అమ్డాపూర్ రాజేష్, పోలీస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ లైన్‌మన్ కుటుంబానికి పవర్ ఉద్యోగుల చేయూత

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

జగిత్యాల పట్టణంలోని గంజ్ వీధిలో నివసిస్తున్న ఎమ్.డి. తహర్ అలీ ఎలక్ట్రిసిటీ విభాగంలో లైన్‌మన్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ చేశారు. నెలకు కేవలం




రూ.1500/-ఈపీఎఫ్ పెన్షన్‌తోనే జీవనం సాగిస్తూ, కొంతకాలంగా పేరాలసిస్ వ్యాధితో బాధపడుతూ ఉన్నారు. ఈ దుస్థితి సమాచారం అందగానే పవర్ ఎంప్లాయిస్ ఆర్గనైజేషన్ జగిత్యాల సభ్యులు స్పందించారు. బాధలో ఉన్న కుటుంబానికి అండగా నిలవాలనే సంకల్పంతో, నిత్యావసర సరుకులు రూ.5 వేల విలువతో పాటు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం మరో రూ.5 వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వరుణ్ కుమార్, అశోక్ రెడ్డి, రమణ, రవిశంకర్ రావు, కుమార్, తిరుపతి, శ్రీహర్షతో పాటు ఇతర సభ్యులు పాల్గొన్నారు. కష్టకాలంలో సహోద్యోగి కుటుంబానికి భరోసాగా నిలవడమే నిజమైన మానవత్వమని వారు పేర్కొన్నారు.

## జాతరలో భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు

**సూర్య సారంగాపూర్**

మహాశివరాత్రి జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామ పంచాయతీ తరుపున ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ కోలపాక రాధ రాజు పేర్కొన్నారు. బైపాస్ రోడ్లపైన మట్టి పోయించి మరమ్మత్తులు చేపట్టామని అన్నారు. పెంబట్ల



లోని రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను బ్లేడ్ ట్రాక్టర్ ద్వారా తొలగిస్తున్నామని, వీధి దీపాలు కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు. జాతరకు విచ్చేస్తున్న భక్తులకు అన్నదాన కార్యక్రమం కూడా దాతల ద్వారా నిర్వహిస్తున్నారని,అలాగే గ్రామ ప్రజలు కూడా నీటిని వృధా చేయకుండా బాధ్యతగా వినియోగించుకోవాలని కోరారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా మంచి నీటి సరఫరాను ప్రధాన అంశంగా తీసుకొని, అన్ని విభాగాలు కలిసి పని చేస్తూ మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు గ్రామపంచాయతీ కట్టుబడి ఉందని అన్నారు. మాజీ ప్రజా ప్రతినిధులు,గ్రామ అభివృద్ధి కమిటీ, గ్రామ ప్రజల సహకారంతో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మైదశీప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, వార్డు సభ్యులు, తోట లక్ష్మణ్, ముద్దం చిరంజీవి, తోట మల్లయ్య, బొడ్డుపల్లి రాజేష్, మంగళపల్లి లచ్చం, తెలు విజయ, దొంగ జ్యోతి, పత్రి లక్ష్మి, పత్తి గంగు, కారు బార్ శ్రీకాంత్, విడిసి సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్ పాఠశాలలో ముందస్తు మహా శివరాత్రి వేడుకలు

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

మాఘ మాసంలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే హిందూ పర్వదినమైన మహాశివరాత్రి సందర్భంగా మల్యాల ఎక్స్ రోడ్‌లో గల ఆల్ఫోర్స్ ఎన్‌ఎస్వి పాఠశాలలో ముందస్తు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ మహాశివరాత్రి శివుడు–పార్వతీ దేవి ఐక్యతకు, ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీక అని తెలిపారు. ఈ పవిత్ర రాత్రి జాగరణ చేయడం, శివలింగానికి బిల్వదళార్చన చేయడం, రుద్రాభిషేకం నిర్వహించడం వలన మానసిక ప్రశాంతత, పాప విముక్తి, సర్వసౌఖ్యాలు కలుగుతాయని విశ్వాసమన్నారు. ఈ పర్వదినాన దేశవ్యాప్తంగా, ముఖ్యంగా తెలంగాణలోని వివిధ శివాలయాలు ప్రత్యేక పూజలతో భక్తులతో కిటకిటలాడుతాయని పేర్కొన్నారు. పాఠశాలలో నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు శివుడు, పార్వతీ దేవి వేషధారణలో పాల్గొని, శివలింగానికి పూజలు నిర్వహిస్తూ భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com



## గడ్డిమందు విషప్రయోగాల్లో తొలి ఐదు గంటలే కీలకం

**- మెడికవర్ నెఫ్రాలజిస్టు రాంచందర్**

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

పారాకుట్ (గడ్డిమందు) తాగిన వారిని 4-5 గంటల్లోపు ఆసుపత్రికి తీసుకురాగలిగితే వారిని బతికించే అవకాశం ఎక్కువగా ఉంటుందని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి నెఫ్రాలజిస్టు డాక్టర్ రాంచందర్ అన్నారు. శనివారం పెద్దపల్లి పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎక్కువగా ఎండోసల్ఫాన్ మందు తీసుకునే వారని దానికి విరుగుడు ఉండడంతో దాదాపుగా అందరిని కాపాడగలిగామన్నారు. ఇటీవల ఆత్మహత్యలన్నీ గడ్డి మందుతోనే జరుగుతున్నాయన్నారు. విరుగుడు లేకపోవడం వల్ల చనిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. కానీ గడ్డి మందు తాగిన వారిని 4 నుంచి 5 గంటల్లోపు ఆసుపత్రికి తీసుకురాగలిగితే.. ఏయే సమయంలో ఏ ట్రీట్‌మెంట్ ఇవ్వాలి, ఏ మందులు ఇవ్వాలనేది సరియైన సమయంలో ఇచ్చి ఐదారు దశల్లో




చికిత్స అందిస్తూ బ్రతికించగలుగుతున్నామని తెలిపారు. ఇదే 5-6 సంవత్సరాల క్రితం గడ్డి మందు తాగితే 100 శాతం చనిపోయే పరిస్థితి నుంచి 25 శాతం బతికించే పరిస్థితికి తీసుకువచ్చామన్నారు. ఇప్పటి వరకు మెడికవర్‌లో గడ్డి మందు తాగిన 200 మంది పేషెంట్లను ట్రీట్ చేసి 52 మంది దాకా బతికించ గలిగామని వెల్లడించారు. స్పెషల్ ఫిల్టర్లు, అధునాతన చికిత్స సహాయంతో ఇది సాధ్యపడుతుందన్నారు. గడ్డిమందు తాగిన పేషెంట్‌ను తరలించేటప్పుడు ఆక్సిజన్‌ను పెట్టకూడదని తెలిపారు. ఆక్సిజన్‌తో లంగ్స్‌లోకి వెళ్లే ప్రమాదముందన్నారు. ఇక స్టోన్‌బెల్ట్‌గా పేరున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రాంతాల్లో కిడ్నీల్లో రాళ్లు ఎక్కువగా వస్తాయన్నారు. ముఖ్యంగా షుగర్, బీపీ ఉన్న వాళ్లు స్టోన్స్‌ని సరిగా పట్టించుకోకపోవడం, కొంతమంది మామూలు నడుం నొప్పిగా భావించి పేయిన్ కిల్లర్స్ వాడడం అలవాటుగా మారిందని తెలిపారు. దీంతో కిడ్నీలు ఎక్కువగా డ్యామేజ్ అవుతున్నాయన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే కిడ్నీ సమస్యల నుంచి బయటపడవచ్చని తెలిపారు.మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ విలేకరుల సమావేశంలో ఆసుపత్రి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నాగరాజు, క్రిటికల్‌కేర్ నిపుణులు డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, దాసరి చంద్రశేఖర్, బొంగోని హరీష్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం బల్దియా ఎన్నికల్లో బీజేపీకి ఘోర పరాభవం

**-ఒక్క డివిజన్‌లోనే గెలుపు, మిగతా చోట్ల నిరాశ!**

**-పెద్ద మొత్తంలో పార్టీ ఫండ్ ఇచ్చినా ఓటమి చెందడంపై బిజెపి హై కమాండ్ సీరియస్**

**సూర్య-గోదావరిఖని:**

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి తీవ్ర నిరాశ ఎదురైంది. మొత్తం 60 డివిజన్ లకు గాను 56 డివిజన్ లలో పోటీ చేసినప్పటికీ ఆశించిన ఫలితాలను సాధించలేకపోయింది. గత మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఆరు స్థానాలను కైవసం చేసుకున్న బిజెపి పార్టీ ఈసారి మాత్రం ఒక స్థానంతో సరిపెట్టుకుంది. 32వ డివిజన్ నుంచి పోటీ చేసిన మమత సమీప ప్రత్యర్థి రమాదేవి పై 162 ఓట్ల తేడాతో గెలుపొంది బిజెపి పరువు కాపాడిందని చెప్పుకోవచ్చు. రామగుండం లింగాపూర్ గ్రామ పరిధిలోని 29వ డివిజన్ నుంచి పోటీ చేసిన కందుల అరుణ 539 ఓట్లు మాత్రమే రావడంతో ఓటమిని చవిచూసింది. బిజెపి రామగుండం ఎమ్మెల్యే అభ్యర్థి ఇక్కడ ఉన్నప్పటికీ ఓటమిని చవిచూడడం తో అందరూ విస్మయానికి గురయ్యారు. బిజెపిలో రాష్ట్ర స్థాయి నాయకు రాలుగా ఉన్న సోమరపు లావణ్య కేవలం 142




ఓట్ల తేడాతో ఓటమిని చవిచూసినప్పటికీ ఇక్కడ ఇండిపెండెంట్ అభ్యర్థి మోహన్ గౌడ్ ఓట్లు చీల్చడంతో కాంగ్రెస్ అభ్యర్థి బయటపడ్డాడు. 29, 31, 33, 34 డివిజన్ లలో బిజెపి అభ్యర్థులు గట్టి పోటీ ఇచ్చినప్పటికీ ఓటమిని చవిచూశారు. ఈ ఎన్నికల్లో స్థానిక అంశాలు, అభివృద్ధి హామీలు, వ్యక్తిగత ఇమేజ్‌లు కీలక పాత్ర పోషించాయని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ప్రధాన ప్రత్యర్థి పార్టీల మధ్య నేరుగా జరిగిన పోరులో బీజేపీ అభ్యర్థులు ఆశించిన మద్దతు పొందలేకపోయారు. ప్రచార సమయంలో రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకుల పర్యటనలు జరిగినప్పటికీ, ఓటర్ల తీర్పు మాత్రం భిన్నంగా వచ్చింది. ముఖ్యంగా ఇక్కడ బిజెపి పార్టీకి స్థానిక సమస్యలపై స్పష్టమైన అజెండా లేకపోవడం, బూత్ స్థాయి బలహీనతలు ఆ పార్టీకి నష్టంగా మారినట్లు తెలుస్తోంది. కొన్ని డివిజన్ లలో బిజెపి పార్టీకి ఏమాత్రం కూడా సంబంధం లేని వారికి టికెట్లు కేటాయించడం, రాజకీయ అనుభవం వారికి లేకపోవడం కూడా ఈ పరాజయానికి కారణంగా పలువురు భావిస్తున్నారు. కొన్ని డివిజన్ లలో అసలు బిజెపి పార్టీ అభ్యర్థి ఎవరో కూడా తెలియని దుస్థితి. ఇప్పటికైనా బిజెపి పార్టీ హై కమాండ్ ఇక్కడ పార్టీ సంస్థాగత పునర్వ్యవస్థీకరణ, బలమైన కేడర్ నిర్మాణంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వెలువడుతున్నాయి. ఇదిలా ఉండగా ఈసారి పార్టీ అధిష్టానం పోటీ చేసే అభ్యర్థులకు భారీ మొత్తంలో పార్టీ ఫండ్ ఇచ్చినప్పటికీ ఓటమి చెందడం పట్ల బిజెపి హై కమాండ్ సీరియస్ గా ఉన్నట్లు తెలుస్తోంది.

## నేత్రదాత బాదం రవికిరణ్‌కు నివాళి

**- నేత్రదాన సర్టిఫికెట్ అందచేత**

**సూర్య, సెంటినరీ కాలనీ**

రామగిరి మండలం కలవచర్ల గ్రామం గోకుల్ నగర్ కు చెందిన బాదం లక్ష్మీ-సత్యం కుమారుడు బాదం రవి కిరణ్ సంతాప సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ జెడ్పీటిసి, లయన్స్ క్లబ్ డైరెక్టర్ గంట వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ... దుఃఖ సమయంలో కూడా రవి కిరణ్ కుటుంబ సభ్యులు తీసుకున్న నేత్రదానం నిర్ణయం చాలా గొప్పదన్నారు. ఒక మనిషి ఈ లోకంలో లేకపోయిన, ఆయన కళ్ల ద్వారా మరో ఇద్దరు ఈ ప్రపంచాన్ని చూడగలగడం నిజంగా



మహోన్నతమైన సేవ అని పేర్కొన్నారు. సమాజానికి ఇది ఆదర్శంగా నిలిచే నిర్ణయమని, ఇలాంటి సేవా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రవి కిరణ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా రవికిరణ్ తల్లిదండ్రులకు నేత్రదాన సర్టిఫికెట్ అందచేశారు. ఈ కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ కార్యదర్శి లింగమూర్తి , సూక రమేష్, ఒర్రె సదయ్య గారు, వార్డ్ సభ్యులు గోనె రాము , బనక అంజయ్య , సమ్మయ్య , బాలయ్య గారు, మోహన్ గారు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## శివాలయాలు ముస్తాబు.....

**- నేడు మహా శివరాత్రి**

**సూర్య - పెద్దపల్లి రూరల్**





సృష్టి కర్త పరమశివునికి అత్యంత ప్రీతిపాత్రమైన మహాశివరాత్రి ని భక్తిశ్రద్ధలతో ఆచరించుకునేందుకు శివాలయాలను శివభక్తులు ముస్తాబు చేశారు. ఆదివారం శివరాత్రి రోజున ఉదయం నుంచి ఉపవాసం ఉంటూ శివాలయాల్లో శివ నామస్మరణ, భజనలు చేస్తే మంచి జరుగుతుందని పురాణాలు, చరిత్ర చెబుతున్నాయి.ఈనేపథ్యంలో శివాలయాలను ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసేందుకు సర్వం సిద్ధం చేశారు. రాగినేడు శ్రీ స్వయంభూ నాగలింగేశ్వర స్వామి శ్రీ రాజరా జేశ్వర స్వామి వేములవాడ దత్తత దేవాలయం, తో పాటు పెద్దకల్వల, ములసాల, గౌరెడ్డి పేట, కొత్తపల్లి తదితర ఆలయాల్లో ప్రత్యేకంగా అలంకరణతో పాటు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. ఉపవాసాలతో శివాలయాలకు వచ్చే భక్తులకు ప్రసాదాలు కూడా ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్యూ లైన్లు , అన్నదాన కార్యక్రమం కూడా ఏర్పాట్లు చేశారు.

## శివసేన సేవా సమితి సభ్యులు రక్తదానం

**సూర్య, సెంటినరీ కాలనీ**



కమాన్ పూర్ మండల కేంద్రంలోని గోకుల్ నగర్ కు చెందిన శివసేన సేవా సమితి సభ్యులు తూండ్ల శ్రీని వాస్ ఆసుపత్రికి రక్తదానం చేశారు. గోదావరిఖనికి చెందిన తుంగపిండి స్వప్న గోదావరి ఖని ప్రభుత్వ ఆసు పత్రిలో చికిత్స పొందుతుండగా ఆమెకు రక్తం అత్యవస రని వైద్యులు సూచించారు. ఈ మేరకు సదరు స్వప్న కుటుంబ సభ్యులు శివసేన సేవా సమితి అధ్యక్షులు గన్నెవరపు రవిని సంప్రదించగా తూండ్ల శ్రీనివాస్ ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన శివసేన సేవా సమితి సభ్యులు శ్రీనివాస్ ను పలువురు అభినందించారు.

## వీధి దీపాలు ఏర్పాటు

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం రత్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో పోచమ్మ దేవాలయం నుంచి సింగరేణి నర్సరీ వరకు వీధి దీపాలు ఏర్పాటు చేయడం జరిగింది. సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేశారు. దీనికి తోడు పలు ప్రాంతాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేశారు.

## హ్యాండ్ రైటింగ్ పోటీలలో నోబెల్ హై స్కూల్ విద్యార్థుల ప్రతిభ...

**సూర్య - పెద్దపల్లి రూరల్**



మండలంలోని పెద్దకల్వల నోబెల్ హై స్కూల్ విద్యార్థులు సౌత్ ఇండియా హ్యాండ్ రైటింగ్ పోటీలలో అద్భుత ప్రతిభ కనబరచి సౌత్ ఇండియా స్థాయి మరియు రాష్ట్ర స్థాయి బహుమతులు అందుకున్నారు.ఈ అవార్డులను ప్రముఖ విద్యావేత్త ప్రొ . కోదండరాం , తెలంగాణ గ్రంథాలయ చైర్మన్ డా. రియాజ్, అక్షర అకాడమీ చైర్మన్ మీరాజ్ చేతుల మీదుగా అందుకున్నారు.విద్యార్థుల కృషి, గురువుల మార్గ దర్శనం, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో సాధ్యం అయిందని కరెస్పాండెంట్ డా . మోహన రాజా అన్నారు. ఈ సందర్భంగా హెచ్ ఎం ప్రణీత, హ్యాండ్ రైటింగ్ టీచర్ శ్రీలత, ఉపాధ్యాయులు అభినందించారు.

# బీజేపీలో చేరిన మరో ఇద్దరు ఇండిపెండెంట్ కార్పొరేటర్లు

**- కేంద్ర మంత్రి బండి సంజయ్ సమక్షంలో చేరిన 17, 39వ డివిజన్ కార్పొరేటర్లు**
**- కాషాయ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించిన బండి సంజయ్**
**- బీజేపీతో సంప్రదింపులు చేస్తున్ మరో ఆరుగురు కార్పొరేటర్లు**
**- మేయర్ ఎన్నిక నాటికి బీజేపీ బలం అనూహ్యంగా పెరిగే అవకాశం**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థులుగా పోటీ చేసి గెలుపొందిన ఇద్దరు కార్పొరేటర్లు కొద్దిసేపటి క్రితం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సమక్షంలో బీజేపీలో చేరారు. 17వ డివిజన్ కార్పొరేటర్ వేముల కవిత చంద్రశేఖర్, 39వ డివిజన్ కార్పొరేటర్ మాసం గణేశ్ ఈ రోజు హైదరాబాద్‌కు విచ్చేసి బీజేపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. వారిద్దరికీ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కాషాయ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. నిన్న(శుక్రవారం) రాత్రి ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే 1 ఇండిపెండెంట్, మరో ఏఐఎఫ్‌బీ కార్పొరేటర్ కరీంనగర్ ఎంపీ కార్యాలయానికి విచ్చేసి బండి సంజయ్ సమక్షంలో పార్టీలో చేరిన సంగతి తెలిసిందే.



తాజాగా మరో ఇద్దరి చేరికతో బీజేపీ బలం 34కు చేరింది. ఎక్స్ అఫిషియో హోదాలో స్థానిక ఎంపీ బండి సంజయ్‌కు కూడా ఒక ఓటు ఉంటున్నందున మొత్తం బీజేపీ బలం 35కు చేరింది. వీరు గాకుండా మరో ఆరుగురు కార్పొరేటర్లు బీజేపీ నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీకి మేయర్ పదవి దక్కడం ఖాయమైంది. దీనిని దృష్టిలో ఉంచుకున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ కు చెందిన కార్పొరేటర్లు, ఇండిపెండెంట్ కార్పొరేటర్లు బీజేపీలో చేరే అంశంపై తర్జన భర్జన పడుతున్నారు. కరీంనగర్‌లో అభివృద్ధి పనుల కోసం కేంద్రం నుండి అధిక నిధులు వస్తుండటం, బీజేపీలో చేరితేనే తమ తమ డివిజన్‌లో ఎక్కువ అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు మరింత దగ్గర కావొచ్చనే భావనతో బీజేపీ ముఖ్య నేతలతో మంతనాలు జరుపుతున్నారు. కాంగ్రెస్ గత రెండేళ్ల పాలనలో కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడం...రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేకపోవడం...వంటి అంశాలను దృష్టిలో ఉంచుకున్న ఆయా కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరితే పెద్దగా ఒరిగేదేమీ ఉండదనే అభిప్రాయానికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీలో చేరే కార్పొరేటర్ల సంఖ్య అనూహ్యంగా పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి.

## పుల్వామా అమరవీరులకు టీఆర్పీ పార్టీ ఘన నివాళి

**సూర్య కరీంనగర్**




2019 ఫిబ్రవరి 14న పుల్వామాలో జరిగిన ఉగ్రదాడిలో అమరులైన సీఆర్పీఎఫ్ జవాన్లకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించి ఘన నివాళులర్పించారు. రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా నాయకత్వంలో రిటైర్డ్ ఆర్మీ జవాన్లతో కలిసి కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టి ఒక నిమిషం మౌనం పాటించారు. ఈ సందర్భంగా అఖిల్ పాషా మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో జవాన్లు ప్రాణత్యాగం చేయడం వల్లే ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని అన్నారు. అమరవీరుల త్యాగం ఎప్పటికీ మరవలేనిదని, వారి కుటుంబాలను ప్రభుత్వాలు అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఉగ్రవాదం మానవాళికి పెద్ద ముప్పని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్పీ జిల్లా అధ్యక్షురాలు గంగిపెల్లి అరుణ, రిటైర్డ్ జవాన్లు మరియు పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎక్స్‌ప్లోరికా పాఠశాలలో అట్టహాసంగా వార్షికోత్సవం

**సూర్య కరీంనగర్**

జ్యోతినగర్‌లోని పారమిత ఎక్స్‌ప్లోరికా పాఠశాల నిర్వహించిన "ఎబూలియెన్స్" వార్షికోత్సవ వేడుకలు రేకుర్తి రాజశ్రీ కన్వెన్షన్ హాల్‌లో కన్నుల పండుగగా జరిగాయి. పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా. ఈ. ప్రసాదరావు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు వ్యక్తిగత సంతోషం, ఆశ, నిస్వార్థ సేవ అనే అంశాలపై ఆకట్టుకునే ప్రదర్శనలు ఇచ్చారు. ప్రకృతి పరిరక్షణ, రైతుల జీవితం, సైనికుల సేవలు వంటి అంశాలు ప్రత్యేకంగా నిలిచాయి. ఈ సందర్భంగా డా. ప్రసాదరావు మాట్లాడుతూ పాఠశాల పిల్లల సమగ్ర అభివృద్ధికి వేదికగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్లు, ప్రిన్సిపాల్ శర్మిష్ఠ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## పుల్వామా ఉగ్ర దాడి మృతులకు క్యాండిల్ ర్యాలీ

**సూర్య కరీంనగర్**




జమ్మూ కాశ్మీర్లో 14 ఫిబ్రవరి 2019లో ఉగ్రవాదుల దాడిలో సిఆర్పిఎఫ్ జవాన్లు 40 మంది మృతి చెందారు. మృతుల సంస్మరణకు కరీంనగర్ పట్టణంలో శనివారం తెలంగాణ ఎక్స్ సిపీఎఫ్ పర్సనల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గీత భవన్ చౌరస్తా వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తెలంగాణ చౌరస్తాలో సీఆర్పీఎఫ్ మృతి చెందిన జవాన్లకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిఎపీఎఫ్ పర్సనల్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వి బాబు ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య సత్యనారాయణ రెడ్డి ఇనుగుర్తి రమేష్ సభ్యులు పాల్గొన్నారు.

## పడిపోయిన టమాటా పంట ధర

**- ఆందోళనలో రైతన్న...**

**సూర్య గంగాధర**



వాణిజ్య పంటలు లాభాదాయకం అని భావించిన మార్కెట్లో ధర లేకపోగా రైతన్న కూదేలైపోయిన సంఘటన. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం వెంకటాయపల్లి గ్రామంలో గంకిడి చంద్రారెడ్డి గంకిడి సాగర్ రెడ్డి ఉప్పుగండ్ల కొలాస రెడ్డి అనే రైతులు సుమారు ముగ్గురు కలిసి 5 ఎకరాలలో టమాటా సాగు చేశారు. కాపుకు వచ్చిన పంటను మార్కెట్‌కి తీసుకెళ్తే 28 కిలోల పెట్టెకు 70 రూపాయల ధర ఉండటంతో కనీసం ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు కూడా రాకపోవడంతో చేతికొచ్చిన టమాట పంటను ఏం చేయాలో అర్థం కాక ఆందోళన చెందుతున్నారు. వాణిజ్య పంటలు లాభాదాయకం అని భావించిన కనీస ధర మార్కెట్లో లేకపోవడం వల్ల కూలీ రెట్లు, ట్రాన్స్ఫోర్ట్ చార్జీలు కూడా రావడం లేదని పంటను కోయలేక చేనులోనే వదిలిపెట్టి నట్టు రైతులు తెలిపారు.

## పుల్వామా దాడికి నిరసనగా విద్యార్థుల కొవ్వొత్తుల ర్యాలీ

**సూర్య, హుజురాబాద్**



పుల్వామాలో ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ, దాడుల్లో మృతి చెందిన అమరవీరులకు నివాళులు అర్పిస్తూ శనివారం రాత్రి హుజురాబాద్ పట్టణంలో విద్యార్థులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. హుజురాబాద్ పట్టణంలోని ట్యూషన్ స్పాట్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో విద్యార్థులు దాడుల్లో మృతి చెందిన అమరవీరుల చిత్రపటాలతో, కొవ్వొత్తులతో అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అమర వీరులకు ఘన నివాళులు అర్పించారు. ఉగ్రవాదుల దాడుల్లో మృతి చెందిన అమరవీరులకు ప్రతి భారతీయుడు కృతజ్ఞతగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భక్తిప్రపత్తులతో ఉమామహేశ్వరుని అర్ధ శతాబ్ది ఉత్సవాలు

**- తరలిరావాలని గ్రామస్తుల పిలుపు...**

**సూర్య, వీణవంక**



వీణవంక మండలం నర్సింగాపూర్ గ్రామంలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానం శనివారంతో ఒక అరుదైన మైలురాయిని చేరుకుంది. 1976లో ప్రతిష్ఠితమైన ఈ ఆలయం నేటికి అర్ధ శతాబ్ది (50 ఏళ్లు) పూర్తి చేసుకుని, వైభవంగా 51వ సంవత్సరంలోకి అడుగుపెడుతోంది. ఈ స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా ఆలయంలో విశేష పూజలు, ఉమామహేశ్వరుల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ పవిత్ర కార్యక్రమంలో నర్సింగాపూర్ గ్రామ ప్రజలతో పాటు మండలంలోని భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారి కల్యాణాన్ని కళ్లారా తిలకించి పునీతులు కావాలని గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు కోరుతున్నారు. గత ఐదు దశాబ్దాలుగా భక్తుల కొంగుబంగారంగా వెలుగొందుతున్న ఉమామహేశ్వర స్వామి వారి కృపాకటాక్షాలు గ్రామ ప్రజలందరిపై ఉండాలని, ఈ శుభ సందర్భంగా ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో ఉత్సవాల్లో పాల్గొనాలని మనవి. 1976-2026 ఐదు దశాబ్దాల ఆధ్యాత్మిక ప్రస్థానం ఈ అర్ధ శతాబ్ది వేడుకలు మన గ్రామానికి గర్వకారణం.

## ఎల్ఎండి వద్ద బోల్తా పడ్డ కొబ్బరి బోండాల వ్యాన్

**సూర్య, తిమ్మాపూర్**




తిమ్మాపూర్ మండలం ఎల్ఎండి కాలనీ వద్ద రాజీవ్ రహదారిపై కొబ్బరి బోండాలతో వస్తున్న మినీ ఆటో బోల్తా పడిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆంధ్ర నుంచి కరీంనగర్‌కు వస్తున్న మినీ ఆటో టీజీ 27 టి 0524 నెంబర్ గల మినీ వ్యాన్ కరీంనగర్‌కు కొబ్బరి బోండాలను లోడ్ చేసుకుని కరీంనగర్‌కు వస్తుండగా ఎల్ఎండి వద్ద ఎక్సెల్ విరిగిపోవడంతో అదుపుతప్పి డివైడర్ దాటి హైదరాబాద్ వైపు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ రాజుకు గాయాలయ్యాయి. కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపు నిత్యం రద్దీతో ఉండే రహదారిపై ప్రమాదం జరగడంతో అరగంట పాటు ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న రహదారి నిర్వహణ సంస్థ సిబ్బంది, పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని బోల్తాపడిన మినీ వ్యాన్ తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

## మండలంలో యూరియా కొరత లేదు

**- వ్యవసాయ శాఖ స్పష్టీకరణ**

**సూర్య, శంకరపట్నం**



శంకరపట్నం మండల పరిధిలో రైతులు యూరియా కొరతపై ఎలాంటి ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయ శాఖ అధికారి జి. వెంకట్ తెలిపారు. మండలంలోని మొలంగూర్, తాడికల్, కొత్తగట్టు, ముత్తారం గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించిన ఆయన రైతులతో మాట్లాడి పరిస్థితులను తెలుసుకున్నారు. ప్రస్తుతం మండలంలో సుమారు 1,800 యూరియా బస్తాలు నిల్వలో ఉన్నట్లు వెల్లడించారు. యూరియా దిగుమతులు నిరంతరం కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మొబైల్ లింక్ లేని రైతులకు గ్రామాల వారీగా వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవోలు) సహాయం అందిస్తూ యాప్‌లో నమోదు చేసి ఎరువుల పంపిణీ సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులకు అవసరమైన మేరకు యూరియా అందుబాటులో ఉంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. మండల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారులకు నివేదికలు పంపినట్లు వెల్లడించారు. రెండు రోజుల్లోగా అదనంగా 100 టన్నుల యూరియా మండలానికి రానుందని పేర్కొన్నారు. రైతులు యూరియాను అవసరానికి అనుగుణంగా వరి పంటలకు వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు.

## బిఆర్ఎస్ అధ్యక్షుడు కేటీఆర్‌కి వివాహ ఆహ్వాన పత్రిక అందచేత

**సూర్య, సెంటినరీ కాలనీ**



టిబిజికెఎస్ యూనియన్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి తన కూతురి వివాహానికి హాజరు కావాలని బిఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కేటీఆర్‌కి వివాహ ఆహ్వాన పత్రికను అందచేశారు. ఈ నెల 26వ తేదీన జరిగే వివాహానికి హాజరు కావాలని కోరారు.

# వీణవంకలో మహాశివరాత్రి వేడుకలు

## - శివపార్వతుల కళ్యాణానికి సర్వం సిద్ధం...

**సూర్య, వీణవంక**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కరీంనగర్ జిల్లా వీణవంకలోని శ్రీ శివాలయం భక్తి పారవశ్యంతో ముస్తాబైంది. ఫిబ్రవరి 15, 16 తేదీల్లో (ఆది, సోమవారాలు) ఆలయంలో మహాశివరాత్రి కళ్యాణ మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఫిబ్రవరి 15 (ఆదివారం) తెల్లవారుజామున 5:30కు గోపూజతో కార్యక్రమాలు ప్రారంభం,ఉదయం 6 గంటలకు ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనం, ఉదయం 10.15 గంటలకు భక్తులచే సామూహిక మహారుద్రాభిషేకం, సాయంత్రం 5 గంటలకు శివపార్వతుల



ఎదుర్కోళ్ల ఉత్సవం, సాయంత్రం 6 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి 8 గంటలకు అత్యంత వేడుకగా "శివపార్వతుల కళ్యాణ మహోత్సవం", రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాల పూజలు, రాత్రి 12.30 గంటలకు స్వామి వారికి ఊంజల్ సేవ, ఫిబ్రవరి 16 (సోమవారం) ఉదయం 9 గంటలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉదయం 11 గంటల నుండి భక్తులకు మహా అన్న ప్రసాద వితరణ, సాయంత్రం 4 గంటలకు 'మను ఈవెంట్స్' వారి కోలాట బృందంతో కలిసి పురవీధుల గుండా అత్యంత వైభవంగా రథోత్సవం జరుగునని ఆలయ కమిటీ తెలిపారు. ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, ఆ స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ, భక్త బృందం కోరుతోంది.

# ఉన్నత విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

## - మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

**సూర్య తిమ్మాపూర్**

ఉన్నత విద్యలో రాణించే విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం ఆయన తిమ్మాపూర్ మండలం మహాత్మా నగర్‌లోని సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహం బాలికలతో మాట్లాడారు. విద్యార్థినీ, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఉన్నత విద్య వారధి వంటిదని,విద్యార్థులకు కీలమైన పదో వార్షిక పరీక్షలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఇందుకు విద్యార్థులు చదువుపై దృష్టి సారించి పరీక్షల్లో రాణించాలన్నారు. వార్షిక పరీక్షకు కొద్ది



రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయని, అత్యంత కీలకంగా మారిన ఈ కొద్ది రోజులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు అవగాహనతో ప్రణాళికాబద్ధంగా చదవాల్సిన అవసరం ఉందన్నారు. మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు తీసుకోవాలని ఆయన సూచించారు. గణితంలో ఎక్కువ మార్కులు సాధించేందుకు అవకాశాలు ఎక్కువన్నారు. అయితే చాలా మంది విద్యార్థులు గణతశాస్త్రమంటేనే బెంబేలెత్తిపోతుంటారని, విద్యార్థులు భయాన్ని వీడి గణితంపై శ్రద్ధ పెట్టాలన్నారు. సూత్రాలతో సాధన చేస్తే గణితంలో ఉత్తీర్ణత సాధించడం కష్టమేమీ కాదని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. ఇప్పటికైనా విద్యార్థులు పదవ తరగతి పరీక్షల కోసం కష్టపడి చదవాలని ఆయన కోరారు. పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధిస్తే నగదు రివార్డుతోపాటు బట్టలు అందజేస్తానని హామీ ఇచ్చారు.

# సిద్ధార్థ విద్యాసంస్థలలో సంస్కృతి-2026



**సూర్య కొత్తపల్లి, కరీంనగర్ రూరల్**

స్థానిక కరీంనగర్‌లోని సిద్ధర్థ విద్యాసంస్థలు స్థాపించి 30 సంవత్సరాలు పురస్కరించుకున్న సందర్భంగా సంస్కృతి-2026 పేరుతో రెసిడెన్షియల్ క్యాంపస్ విద్యార్థులకు రంగినేని గార్డెన్నందు అంగరంగ వైభవంగా వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి , డైరెక్టర్ దాసరి స్వప్న శ్రీపాల్ రెడ్డి  జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ఆరంభించారు. విద్యార్థుల తల్లిదండ్రులందరూ ఈ వేడుకలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా వివిధ రంగాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి బహుమతి ప్రధానం చేసారు. విద్యార్థులు ప్రదర్శించిన అష్టలక్ష్మి వైభవం, భక్త ప్రహ్లాద, రామాయణం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ పిల్లలు చిన్నతనం నుండే చదువుతో పాటు సంస్కారం నేర్చుకోవాలని, వారు మంచిమార్గంలో రాణించడానికై తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనదని అన్నారు. ఈ కార్యక్రమం సంవత్సరం పొడవునా విద్యార్థులు సాధించిన ప్రతిభ, కృషి, క్రమశిక్షణ మరియు విలువల ప్రదర్శనకు ఒక వేదిక అని ప్రత్యేకంగా హాస్టల్ విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు, నాయకత్వ లక్షణాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ తమ ప్రతిభను మెరుగుపరుచుకుంటున్నారని, ఇంటి నుండి దూరంగా ఉండి కూడా, పిల్లలు చూపుతున్న ఆత్మవిశ్వాసం, పట్టుదల మరియు నిబద్ధత మాకు గర్వకారణమని పిల్లల విజయంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో ముఖ్యమైనది. తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఆశిస్సులు విశ్వాసం వారికి మరింత ధైర్యం మరియు ఉత్తేజాన్ని ఇస్తాయని తల్లిదండ్రులను ఉద్దేశించి అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి, డైరెక్టర్ దాసరి స్వప్న శ్రీపాల్ రెడ్డి, ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



# మహా శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

**సూర్య, హుజురాబాద్**

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని హుజురాబాద్ పట్టణంలోని భవానీ శంకర మహాదేవాలయంలో ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు దేవాలయ అర్చకులు కాట్రపల్లి విశ్వనాథ్ శర్మ తెలిపారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం నాలుగు గంటల నుండి సుప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్యాహవాచనము, మధ్యాహ్నం అభిషేకం, ఒంటి గంటకు శ్రీ భవాని శివశంకర కళ్యాణం, సాయంత్రం ఏడు గంటల నుండి రాత్రి వరకు విశేష దర్శనాలు ఏర్పాటు చేసినట్లు, రాత్రి 10.30 నుండి 1 వరకు లింగోద్భవ కాలం, ప్రత్యేక పూజలు ఉంటాయని ఆయన తెలిపారు. దేవాలయ దర్శనానికి వచ్చే భక్తులు సాంప్రదాయ దుస్తులతో రావాలని ఆయన కోరారు.

**- మండలంలో...**

హుజురాబాద్ మండలం, చెల్పూర్, సిర్సపల్లి, పెద్ద పాపయ్యపల్లి, కందుగుల గ్రామాలలోని శివాలయాల్లో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆయా దేవాలయ కమిటీలు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

# అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

**సూర్య కరీంనగర్**

కరీంనగర్ రూరల్ పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నగునూరు గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల వద్ద అదే గ్రామానికి చెందిన బోదాసు అచ్యుత్ అనునతడు తన ట్రాక్టర్ నందు అక్రమంగా  ఇసుక రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. బొమ్మకల్ గ్రామానికి చెందిన నేరెళ్ల శ్రీనివాస్ అనున్నతడిని బొమ్మకల్ గ్రామంలోని ప్లైఓవర్ బ్రిడ్జి వద్ద తన ట్రాక్టర్లో అక్రమ ఇసుక రవాణా చేస్తుండగా పట్టుకున్నారు. వాష్ణుఅఆ ూతీఖఎ దుర్శేడ్ గ్రామానికి చెందిన శ్రీరామోజు తిరుపతి అనునాథుడు ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. అట్టి నిందితులపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేసి తదుపరి చర్య నిమిత్తం కోర్టుకు పంపనైనది. ఎవరైనా అక్రమ వయసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

# రేకుర్తి 19వ డివిజన్‌లో కార్పొరేటర్‌గా ఘన విజయం సాధించిన సుదగోని మాధవి కృష్ణ గౌడ్

**సూర్య కొత్తపల్లి**




కరీంనగర్ నగరంలోని రేకుర్తి 19వ డివిజన్ కార్పొరేటర్‌గా సుధ గోని మాధవి కృష్ణ గౌడ్ ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనమీద అభిమానంతో ఓట్లు వేసి గెలిపించిన డివిజన్ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వందలాది మంది అభిమానులు పాల్గొన్నారు.

# సీతారాంపూర్ 23వ డివిజన్‌లో కార్పొరేటర్‌గా ఘన విజయం సాధించిన గుమ్మడి రాజకుమార్

**సూర్య కొత్తపల్లి**



కరీంనగర్ నగరంలోని సీతారాంపూర్ 23వ డివిజన్ కార్పొరేటర్‌గా గుమ్మడి రాజకుమార్ ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనమీద అభిమానంతో ఓట్లు వేసి గెలిపించిన డివిజన్ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వందలాది మంది అభిమానులు పాల్గొన్నారు.

# సీఎం కప్ "జిల్లాస్థాయి" పోటీల్లో సత్తాచాటిన "సరస్వతి"

**సూర్య రామడుగు**



సీఎం కప్ జిల్లాస్థాయి పోటీల్లో రామడుగు మండలం వెలిచాల సరస్వతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటినట్లు హెచ్ఎం ఉప్పుల శ్రీనివాస్ తెలిపారు. కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో శనివారం జరిగిన అండర్-29 విభాగం త్రైక్వాండో పోటీల్లో ఎస్.మణిచరణ్ సిల్వర్ మెడల్ చెస్ జూనియర్ విభాగంలో ఎం.నిహారిక సిల్వర్ మెడల్ సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు ఇతర రంగాల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు.

# జిల్లా స్థాయి యోగాలో నవోదయ విద్యార్థుల ప్రతిభ

**సూర్య చొప్పదండి**



కరీంనగర్‌లోని రీజనల్ స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగిన సిఎం కప్ యోగా అండర్ 19, అండర్ 14 విభాగ పోటీల్లో చొప్పదండి పిఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థులు ప్రతిభ కనబర్చి మూడు గోల్డ్, మూడు సిల్వర్ పతకాలు సాధించారు. చంద్ర హంసిని, ప్రణవి సిరి, రుషికేష్‌లు గోల్డ్ పతకాలు, కడకుంట్ల హంసిని, కుంటల సహస్ర, అంజిరెడ్డిలు సిల్వర్ పతకాలు సాధించారు. ఇందులో చంద్రహంసిని, ప్రణవి సిరి, రుషికేష్‌లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి, పిఈటి రాధిక తదితరులు అభినందించారు.

# నేడే మహాశివరాత్రి... ముస్తాబైన శివాలయాలు

**సూర్య, ఇల్లందకుంట**



మహాశివరాత్రి హిందువులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే పెద్ద పండుగ. ఈ రోజు శివపార్వతులకు వివాహం జరిగిన రోజు. శివుడికి పూజలు చేయడం నుంచి ఉపవాసం, జాగరణ చేసి భక్తి పారవశ్యంలో మునిగి తేలుతారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇల్లందకుంట మండల వ్యాప్తంగా శివాలయాలు అత్యంత సుందరంగా ముస్తాబయ్యాయి. శివునికి ఎంతో ఇష్టమైన రోజు కావడంతో శివ భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేసి, స్వామి వారిని దర్శించుకుంటారు. కావున వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# ప్రతిపక్ష పాత్రలో ప్రజల పక్షాన నిలబడతాం

### - బీజేపీ గెలుపులో మాజీ బీఆర్ఎస్ నేతలే ఎక్కువ.. - కాంగ్రెస్ - బీజేపీ మధ్య లోపాయికారీ ఒప్పందం

### - బీఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్లహరి శంకర్

**సూర్య కరీంనగర్**

నగర పాలక సంస్థ ఎన్నికల తీర్పును గౌరవిస్తూ, బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిలబడతామని , నగర ప్రజల సమస్యలపై రాజీ పడకుండా పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ అన్నారు. శనివారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నగర ప్రజల తీర్పును శిరసావహిస్తున్నామని, తమను ఆదరించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేషన్‌లో బీజేపీ సాధించిన 30 సీట్లలో 11 మంది మాజీ బీఆర్ఎస్ అభ్యర్థులే ఉన్నారని, ఇతర పార్టీల నేతలను చేర్చుకుని గెలవడం బీజేపీ నైతిక విజయం కాదని విమర్శించారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఇతర మున్సిపాలిటీల్లో బీజేపీ పరాజయం పాలవ్వడం కేంద్ర మంత్రి బండి సంజయ్ వైఫల్యమేనని ఎద్దేవా చేశారు. మేయర్ ప్రమాణ స్వీకారానికి ముందే బండి సంజయ్ ప్రజలకు స్పష్టమైన హామీ ఇవ్వాలని హరిశంకర్ డిమాండ్ చేశారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్ అవినీతికి పాల్పడిందని ఆరోపించిన సంజయ్, అదే పార్టీకి చెందిన వారిని బీజేపీలో ఎలా చేర్చుకున్నారో సమాధానం చెప్పాలన్నారు. ఎన్నికల్లో ఒక్కో అభ్యర్థికి రూ.50 లక్షలు ఖర్చు చేశారని ఆరోపిస్తూ, ఆ నిధులు




ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలకు వెల్లడించాలన్నారు. ఎన్నికల వేళ కాంగ్రెస్ , బీజేపీ మధ్య లోపాయికారీ ఒప్పందం కుదిరిందని ఆరోపించారు. గతంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్ హయాంలో అభ్యర్థులు అక్రమాలకు పాల్పడితే ఫిర్యాదు చేయాలని ధైర్యంగా చెప్పారని, ఇప్పుడు బండి సంజయ్ తన కార్పొరేటర్ల విషయంలో అలాంటి హామీ ఇవ్వగలరా అని ప్రశ్నించారు.ఎన్నికల ముందు ప్రత్యేక నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తానని చెప్పిన బండి సంజయ్, గెలిచిన తర్వాత మాట మార్చారని విమర్శించారు. డివిజన్లలో బీఆర్ఎస్ అభ్యర్థులను లేకుండా చేస్తానని వ్యాఖ్యానించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, రాజకీయ ప్రతీకారం కాకుండా అభివృద్ధి మీద దృష్టి పెట్టాలని సూచించారు.మూడేళ్ల క్రితం శంకుస్థాపన చేసిన టీటీడీ ఆలయ పనులు ఎందుకు ఆగిపోయాయో చెప్పాలన్నారు. కేంద్ర మంత్రిగా నగరానికి ప్రత్యేక నిధులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. కాగా, పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన కార్యకర్తలపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని, పార్టీ కోసం శ్రమించిన వారికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్ జక్కని ఉమాపతి బిఆర్ఎస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు చేతి చంద్రశేఖర్, తొంటి రాజేందర్ రాచకొండ నరేష్ అనుమల్ల ఉమా శంకర్ దూలం సంపత్ గౌడ్ నాగుల కిరణ్ కుమార్ గౌడ్ దుర్గం శ్రీకాంత్ గౌడ్ మరియు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వీణవంకలో ఇసుక దుమ్ముకు చెక్

### - పోలీసుల చొరవతో టీజీఎండీసీ కీలక నిర్ణయం...!

**సూర్య, వీణవంక:**

ఇసుక క్వారీ లారీల వల్ల వస్తున్న దుమ్ముతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న వీణవంక మండల ప్రజలకు ఉపశమనం లభించింది. పోలీస్ శాఖ, తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ సమన్వయంతో మండలంలో దుమ్ము నివారణ చర్యలు ముమ్మరమయ్యాయి.ప్రజల ఆరోగ్యంపై పోలీసుల ప్రత్యేక దృష్టి, నిరంతరం ఇసుక లారీల రాకపోకల వల్ల గ్రామాలు దుమ్ము మయంగా మారడం, తద్వారా చిన్నపిల్లలు, వృద్ధులు శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్న విషయాన్ని వీణవంక పోలీస్ అధికారి ఆవుల తిరుపతి సీరియస్‌గా తీసుకున్నారు. ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా తక్షణమే స్పందించిన ఆయన, కరీంనగర్ టీజీఎండీసీ అధికారులతో చర్చలు జరిపారు. రహదారుల పై నీళ్లు చల్లడం ద్వారా దుమ్మును నియంత్రించాలని గట్టిగా కోరారు. రంగంలోకి 5 వాటర్ ట్యాంకర్లు పోలీస్ అధికారి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన టీజీఎండీసీ, మండలంలోని ప్రధాన రహదారులు, గ్రామాల్లో నీళ్లు చల్లడానికి ఐదు ట్రాక్టర్లతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ట్యాంకర్లు ప్రతిరోజూ నిర్దేశిత గ్రామాల్లో నీటిని చల్లుతూ దుమ్ము లేవకుండా చర్యలు తీసుకుంటాయి. అన్నారం గ్రామంలో జంగా సంపత్ (ఏపి 15 టిఏ 0151), పచ్చునూర్ గ్రామంలో నర్మేట వీరయ్య (టిఎస్ 02 ఎఫ్టి 4258), మామిడాలపల్లి



గ్రామంలో కంకనాల మల్లారెడ్డి (టిఎస్ 02 ఈజెడ్ 3973), చల్లూరు గ్రామంలో మంద వంశీధర్ రెడ్డి (టిఎస్ 02 యుఈ 1299), మండల వ్యాప్తంగా అడిగొప్పుల సంపత్ (టిఎస్ 35 ఈ 3355) పంపిణీ చేస్తున్నాయి. ఈ ట్యాంకర్లు క్రమం తప్పకుండా తిరిగేలా ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ?ప్రజల కష్టాలను గుర్తించి, సత్వరమే పరిష్కారం చూపిన పోలీస్ అధికారి ఆవుల తిరుపతికి మండల ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ పీఠముడి

### - సమాన బలంతో రెండు పార్టీలు

**సూర్య జమ్మికుంట**

సోమవారం జరగనున్న జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ఎంపిక పీఠముడి పడింది జమ్మికుంట పట్టణంలో 30 వార్డులు ఉండగా అధికార కాంగ్రెస్ పార్టీకి 10 మంది కౌన్సిలర్లు బి ఆర్ ఎస్ పార్టీకి 12 మంది కౌన్సిలర్లు బిజెపి పార్టీకి నలుగురు కౌన్సిలర్లు ఇతరులు నాలుగు స్థానాల్లో గెలిచారు ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాకపోవడంతో ఇతర పార్టీల కౌన్సిలర్లు ఇండిపెండెంట్ కౌన్సిలర్ల సహకారంతో చైర్మన్ సీటును దక్కించుకోవడానికి కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీలు క్యాంప్ రాజకీయాలకు తెరతీసాయి ఇందులో బిఆర్ఎస్ పార్టీకి చెందిన 12 వార్డు కౌన్సిలర్ చుంచు రమ తన ఇష్టంతోనే కాంగ్రెస్ గూటికి చేరుకోగా ముగ్గురు ఇండిపెండెంట్




కౌన్సిలర్లు ఒక ఫార్వర్డ్ బ్లాక్ కౌన్సిలర్ ప్రస్తుతం కాంగ్రెస్ శిబిరంలోనే ఉన్నట్లు సమాచారం అదేవిధంగా పదకొండు మంది బిఆర్ఎస్ కౌన్సిలర్లు ఎట్టి పరిస్థితుల్లోని కాంగ్రెస్ కు సహకరించే అవకాశం లేని నలుగురు బిజెపి కౌన్సిలర్ల సహకారంతో ఎమ్మెల్యే ఎక్స్ అఫీషియో సభ్యునిగా ఓటు వేసి చైర్మన్ పదవిని దక్కించుకోవడానికి బి ఆర్ఎస్ శిబిరంలో తీవ్ర ప్రయత్నాలు ప్రారంభించారు అయితే ఎక్స్ అఫీషియో సభ్యునికి తప్పకుండా సదరు మున్సిపాలిటీలో ఓటు హక్కు ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా సర్క్యులర్ జారీ చేయడంతో స్థానిక వీణవంకలో ఓటు హక్కు కలిగిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఎక్స్ అఫీషియో ఓటు జమ్మికుంట మున్సిపాలిటీలో వేయడానికి వీలు లేకుండా మారింది దీంతో రెండు శిబిరాలలో 15 మంది సభ్యులతో ప్రస్తుతం సమాన బలంగా ఉండటంతో మున్సిపల్ చైర్మన్ పీఠంపై పీఠముడి పడింది చైర్మన్ ఎంపిక సోమవారం జరగడంతో ఈ రెండు రోజుల్లో బలాబలాలు మారి చైర్మన్ పదవి ఎవరికి దక్కుతుందో అన్న ఊహాగానాలు జమ్మికుంట పట్టణంలో షికారు చేస్తున్నాయి.

# తాటి చెట్టు పై నుండి జారిపడి గీత కార్మికుడు మృతి

### - కొండపాకలో విషాదం

**సూర్య, వీణవంక**



వీణవంక మండల పరిధిలోని కొండపాక గ్రామంలో శనివారం విషాద ఘటన చోటుచేసుకుంది. తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడి గట్టు అయిలయ్య (50) అనే గీత కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందారు. ?గ్రామానికి చెందిన గట్టు అయిలయ్య (తండ్రి వెంకటయ్య) వృత్తి రీత్యా తాటి చెట్టు ఎక్కుతుండగా పట్టు తప్పి కిందపడ్డారు. తీవ్ర గాయాలు కావడంతో ఆయన ప్రాణాలు కోల్పోయారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబం రోదనలు మిన్నంటాయి. ?మృతుడి పెద్ద కుమారుడు శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి కేసు నమోదు చేశారు. మృత దేహాన్ని పరిశీలించి, ప్రమాదం జరిగిన తీరుపై దర్యాప్తు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ?అయిలయ్య ది అత్యంత నిరుపేద కుటుంబమని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. రెక్కాడితే గానీ డొక్కాడని ఆ కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, ఎక్స్‌గ్రేషియా ప్రకటించి అండగా నిలవాలని కోరారు.




# ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సిద్ధం కావాలి

### - మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

**సూర్య కరీంనగర్**

రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీకి సిపిఐ శ్రేణులు సిద్ధం కావాలని సిపిఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. కరీంనగర్‌లోని సిపిఐ జిల్లా కార్యాలయంలో చిగురుమామిడి మండల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.మండలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టు నాయకత్వం అవసరమని, రైతాంగానికి సాగునీరు, పేదలకు గృహాలు, పెన్షన్లు వంటి అంశాలపై పార్టీ శ్రేణులు చురుకుగా పనిచేయాలని సూచించారు. ప్రజల మధ్య ఉండి పోరాడితేనే ఎన్నికల్లో విజయం సాధించవచ్చన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ చిగురుమామిడి మండలంలో పార్టీ పట్టు బలంగా ఉందని, రాబోయే ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి స్థానాలను కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉరివేసుకుని రైతు ఆత్మహత్య

### - కోనరావుపేటలో ఘటన

**సూర్య కోనరావుపేట**



అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఓ రైతు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజన్న సిరిసిల్ల కోనరావుపేట మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఫణి శంకర్ బాబు(53) అనే వ్యక్తి వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శంకర్ బాబు గత నాలుగు సంవత్సరాల నుండి దీర్ఘకాలిక వ్యాధులతో పాటు నరాల బలహీనతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాడు. దీంతో అనారోగ్యం సహకరించకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురై శనివారం తెల్లవారుజామున ఇంటి ముందు ఉన్న పశువుల పాకలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.అటుగా వెళ్లిన భార్య వసంత గమనించి చుట్టూ ప్రక్కల వారిని పిలిచేసరికి అప్పటికే బాబు మృతిచెందినట్లు పేర్కొన్నారు. ఇంటి పెద్దదిక్కు విగతజీవిగా మారడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య వసంత, ఇద్దరు కుమారులు ప్రశాంత్, ప్రవీణ్‌ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా హాస్పటల్ కు తరలించారు.బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్ రెడ్డి తెలిపారు.బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ కాశీరాం, గ్రామస్తులు కోరారు.

# ఓట్ల వ్యత్యాసంపై స్పష్టతనివ్వాలి

## - ఎన్నికల్లో అధికార పార్టీ రిగ్గింగ్ - ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**సూర్య, హుజురాబాద్**

మున్సిపల్ ఎన్నికల్లో పోలింగ్ రోజు కౌంటింగ్‌లో ఓట్లలో వ్యత్యాసం ఉందని, దీనిపై ఎన్నికల సంఘం స్పష్టతనివ్వాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన హుజురాబాద్ పట్టణ శివారులోని కేసి క్యాంపులో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... హుజురాబాద్ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా అధికారులు ప్రవర్తించిన తీరుపై ప్రజలకు తీవ్ర అనుమానాలు వస్తున్నాయని అన్నారు. 11న జరిగిన పోలింగ్ బ్యాలెట్ బాక్స్ లను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భద్రపరిచారని, కానీ కౌంటింగ్ రోజున అధికారులు తాళాలు మర్చిపోయారని చెప్పి వాటిని పగలగొట్టడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. ఇదే సమయంలో ఆ ప్రాంతానికి విలేకరులను రానివ్వకపోవడం, అక్కడున్న సిసి కెమెరాల వైర్లను తొలగించడం వంటి చర్యలు అధికారులు ఎందుకు చేశారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అంతకు ముందు రోజు మూడు గంటల పాటు హుజురాబాద్ లో కరెంటు పోవడం, బాధ్యతాయుతమైన అధికారులు స్ట్రాంగ్ రూమ్ తాళాలు మర్చిపోవడం చాలా చిన్న విషయంగా భావించడం ఏమిటని అన్నారు. ఇప్పటి వరకు స్ట్రాంగ్ రూమ్ తాళాలు మరిచిపోయిన బాధ్యులైన వారిపై ఎన్నికల సంఘం ఎలాంటి చర్యలు తీసుకుందో చెప్పాలని డిమాండ్ చేశారు. స్ట్రాంగ్ రూమ్ తాళాలు పగలగొట్టిన తర్వాత బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాల్ లో తీసుకెళ్లే సమయంలో సిబ్బంది ఒక బ్యాలెట్ బాక్స్ బదులు మరొక బ్యాలెట్ బాక్స్ తీసుకొని రావడం ఏజెంట్లు అభ్యంతరం తెలపడంతో ఇది ఇక్కడ కాదు మరొకటి అని మరొక బాక్స్ తీసుకురావడం ఆషామాశి వ్యవహారంగా చేయడమేమిటని ఆయన అన్నారు. ఒకటో వార్డులో పోలైన ఓట్ల సంఖ్య 827 గా ఎన్నికల అధికారులు రాసి ఇచ్చారని, కానీ కౌంటింగ్ రోజున 830 ఓట్లు ఎలా ఉంటాయని అన్నారు. ఈ రెండు పత్రాలు కూడా అధికారులు ఇచ్చినవేనని, వీటిలో ఏది నిజం...? ఏది అబద్ధం..? అని అన్నారు. ఏడో వార్డు విషయంలో కూడా ఇదే జరిగిందని, 16వ వార్డులో ప్రిసైడింగ్ అధికారి సంతకాలు లేని బ్యాలెట్ పేపర్లు 100 ఉన్నాయని, అధికారులు ఇచ్చారని, అధికారుల సంతకాలు లేకుండా అన్ని బ్యాలెట్ పేపర్లు ఎలా ఉపయోగిస్తారని ఆయన ప్రశ్నించారు. ఇది అధికార పార్టీ రిగ్గింగ్ కు ఉపయోగపడే చర్య అని ఆయన అన్నారు. ఒక్కొక్క వార్డులో ఇలా ఓట్ల వ్యత్యాసం బాగా కనబడుతుందని, దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు. ఓట్ల వ్యత్యాసం పై స్పష్టత ఇవ్వకపోతే కోర్టులో పిల్ వేస్తామని, అంత వరకు హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నికను ఆపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ ఈ విషయంపై స్పందించి విచారణకాదేశించాలని, విచారణ అనంతరమే చైర్ పర్సన్ ఎన్నిక జరపాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, సింగిల్ విండో మాజీ చైర్మన్ ఎడవెల్లి కొండల్ రెడ్డి, కౌన్సిలర్లు వర్ధినేని రవీందర్ రావు, గందె శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు మారేపల్లి సుశీల, యాదగిరి నాయక్, నాయకులు కాసనగొని కిరణ్, ఎండి. ఇమ్రాన్, గఫార్ తదితరులు పాల్గొన్నారు.



# రాజన్న ఆలయ విస్తరణ పనుల్లో వేగం పెంచాలి

## - సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్-భీమేశ్వర ఆలయంలో పూజలు
## - ఆర్టీసీ ఉచిత రవాణా బస్సు ప్రారంభం

**సూర్య, వేములవాడ**

రాజన్న ఆలయ విస్తరణ పనుల్లో వేగం పెంచాలని సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్ ఆదేశించారు. శ్రీ భీమేశ్వర ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు వేములవాడకు రాగా, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు. శ్రీ భీమేశ్వర ఆలయంలో అర్చకులు సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్ కు స్వస్తితో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు అర్చకులు స్వామివారి ప్రసాదాన్ని అందజేసి, ఆశీర్వచనం అందించారు.

**- ఆలయ విస్తరణ పనుల పరిశీలన**

రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనులకు సంబంధించిన ఫోటోలు పరిశీలించారు. పనులపై పలు సూచనలు చేశారు.

**- ఉచిత బస్సు సర్వీసులు ప్రారంభం**

వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ నుంచి ఆలయం దాకా భక్తులను ఉచితంగా తరలించే ఆర్టీసీ బస్సులను సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ప్రారంభించారు.

**- ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలి**

రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను ఒక ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్ ఆదేశించారు. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ



అగ్రవాల్ తో కలిసి ఆర్ అండ్ బీ, ఆలయ అధికారులు, ఆర్కిటెక్ట్ మూర్తి, కాంట్రాక్టర్ తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధాన ఆలయ విస్తరణ, ఇతర ప్రతి అభివృద్ధి పనికి సంబంధించి ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించారు. పనుల్లో వేగం పెంచాలని, అవసరమైన పనివారి సంఖ్య మరింత పెంచాలని ఆదేశించారు. పనుల పురోగతిలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే వాటిని సమన్వయంతో పరిష్కరించాలని తెలిపారు. నాణ్యతతో పనులను పూర్తి చేయాలని సూచించారు. నూతన గోశాల నిర్మాణం, ఇతర అంశాలపై చర్చించారు. ఇప్పుడు ఉన్న గోశాలలో ఎన్ని కోడెలు ఉన్నాయని ఆరా తీశారు. వాటి సంరక్షణ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు, బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ, గుడి చెరువు బండ్ పార్క్ పనులపై సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాస్ రాజ్ కు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఏర్పాటు చేసి వివరించారు. సమావేశంలో ఆర్అండ్ బీ సీఈ రాజేశ్వర్, ఎస్ఈ రాములు ఈఈ నరసింహాచారి, ఆలయ ఈఈ రాజేష్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# సూసైడ్ అటెమ్ట్ చేస్తున్నానంటూ సెల్ఫీ...

## - పోలీసు కేసు నుండి తప్పించుకునేందుకు తప్పుడు ఆరోపణలు చేసిన ఘనుడు
## - సెల్ఫీ వీడియోతో సమాజాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసిన నిందితుడు
## - ఎట్టకేలకు నిందితుడిని పట్టుకుని కోర్టులో హాజరు పర్చిన పోలీసులు



**సూర్య కరీంనగర్**

తాను చేసిన నేరం నుండి తప్పించుకునేందుకు సూసైడ్ చేసుకుంటున్నట్టుగా సెల్ఫీ వీడియో తీసి భయాందోళనలకు గురి చేసిన నిందితుని అసలు గుట్టు తేల్చారు పోలీసులు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి కేసు బారిన పడకుండా ఉండేందుకు సెల్ఫీ వీడియో తీసి... పోలీసులపై ఆరోపణలు చేసి... ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్నాని బెదిరింపులకు పాల్పడి తప్పించుకుని తిరుగుతున్నఆ ప్రబుద్ధుడిని అరెస్ట్ చేశారు. ప్రేమ వ్యవహారంలో యువతిని వేధించడంతో పాటు, ఆమె కాబోయే భర్తను పిలిపించుకుని దాడి చేసి డబ్బులు, బైక్ లాక్కున్న కేసులో ఇరుక్కొవద్దన్న ఆలోచనతో పోలీసులపై లేనిపోని ఆరోపణలు చేసిన యువకుడిని పోలీసులు వెంటాడి మరీ పట్టుకున్నారు. కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ లో ప్రేవేటు ఉద్యోగం చేసుకుంటున్న ఓ యువతితో రోమాల ఉదయ్ పరిచయం ఏర్పడింది. ఆమె సెల్ నంబర్ తీసుకున్న ఉదయ్ తరుచూ మాట్లాడు తుండేవాడు. కొద్ది రోజుల తరువాత సదరు యువతిని ప్రేమిస్తున్నానని నమ్మించే ప్రయత్నం చేశాడు. అయితే ఉదయ్ వేరే యువతితో ప్రేమ వ్యవహారం నడుస్తున్న విషయం గురించి బాధితురాలు అడగడంతో అలాంటిదేమీ లేదని బుకాయించాడు. అయితే బాధిత యువతి పని చేస్తున్న చోట తనతో పాటు పని చేస్తున్న మరో యువకుడిని ప్రేమించి పెళ్లి చేసుకోవాలని భావించింది. తమ ఇంట్లోని పెద్దలకు ఈ విషయం చెప్పి వివాహం చేసుకోవాలనుకున్నారు. ఈ విషయం తెలిసిన ఉదయ్ జనవరి 18 2026న బాధితురాలును తన బైక్ పై తీగలగుట్టపల్లిలోని చంద్రపురి కాలనీకి తీసుకెళ్లి తన స్నేహితులతో బెదిరింపులకు గురి చేశాడు. అంతేకాకుండా ఆమె పెళ్లి చేసుకోవాలనుకున్న యువకుడిని వదిలేయాలని హెచ్చరించడంతో పాటు ఫోన్ చేసి అతన్ని పిలిపించాలని ఒత్తిడి చేశాడు. దీంతో బాధితురాలు తన కాబోయే భర్తను అక్కడకు పిలిపించగా అప్పటికే కాపు కాసి ఉన్న ఉదయ్ అతని స్నేహితులు అతన్ని బెదిరించారు. దీంతో భయాందోళనకు గురైన అతను అక్కడి నుండి వెళ్లిపోగా అతని స్నేహితులను అడ్డుకుని రూ. 50 వేలు ఇవ్వాలని బెదిరించారు. వారి వద్ద ఉన్న బైక్ తో పాటు రూ. 2 వేలు వసూలు చేసుకున్న తరువాత వారిని వదిలేశారు. ఆ తరువాత ఉదయ్ బాధిత యువతిని కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలో దింపి ఆమె కాబోయే భర్త దాడి చేశాడని ఫిర్యాదు చేయాలని చెప్పి వెళ్లిపోయాడు. అయితే బాధితురాలు తనపై ఉదయ్ దారుణంగా వ్యవహరించాడని, తనతో పాటు తనకు కాబోయే భర్తపై కూడా దాడి చేశాడని పిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న క్రమంలో ఉదయ్ సెల్ఫీ వీడియో ద్వారా కొంతమంది పేర్లు చెప్పడంతో పాటు చేయని తప్పుకు కేసు నమోదు చేసిన సీఐ బాధ్యులంటూ ఆరోపణలు చేశాడు. పురుగుల మందు తాగినట్టుగా వీడియోలో రికార్డ్ కాగా ఆ తరువాత ఉదయ్ ఆ చూకి లభ్యం కాలేదు. దీంతో పోలీసులు ఉదయ్ కోసం గాలింపు చేపట్టినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. సాంకేతికత సాయంతో ఉదయ్ కోసం ఆరా తీస్తున్న క్రమంలో శుక్రవారం ఆచూకి లభ్యం అయింది. అతన్ని అదుపులోకి తీసుకుని శనివారం కోర్టులో హాజరు పరిచినట్టుగా సీఐ ఏ నిరంజన్ రెడ్డి తెలిపారు. నిందితుడు ఉదయ్ పై గతంలో వీణవంక, కరీంనగర్ పోలీస్ స్టేషన్ లలో రెండు కేసులు నమోదయ్యాయని వివరించారు. నేర చరిత్ర ఉన్న ఉదయ్ తనను తాను కాపాడుకునేందుకు ఈ ఘటనలో బాధితులను నిందితులుగా క్రియేట్ చేయడంతో పాటు పోలీసులపై లేని పోని ఆరోపణలు చేశాడని సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. వాస్తవంగా జరిగిన దానికి ఉదయ్ వీడియో ద్వారా చేసిన ఆరోపణలు ఏ మాత్రం పొంతన లేదని స్పష్టం చేశారు. చట్టం నుండి తప్పించుకునేందుకు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడుతున్నట్టుగా సెల్ఫీ వీడియోలు తీసి తప్పించుకునే ప్రయత్నం చేసినట్టయితే కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందన్న విషయం గుర్తు పెట్టుకోవాలని సీఐ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

# హుజురాబాద్ " మహారాణి " ఎవరు..!?

సూర్య, హుజురాబాద్

హుజురాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు అత్యధికులు విజయం సాధించడంతో హుజురాబాద్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ గా గద్దెనెక్కె మహారాణి ఎవరు అని ప్రజలు చర్చించుకుంటున్నారు. హుజురాబాద్ చరిత్రలో మొదటిసారిగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో విజయం సాధించి ఎవరి మద్దతు అవసరం లేకుండా కుర్చీపై కూర్చుని పరిస్థితి ఉండడంతో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. హుజురాబాద్ చైర్ పర్సన్ పదవిని ఎస్సీ మహిళకు కేటాయించడంతో విజయం సాధించిన ఎస్సీ మహిళ అభ్యర్థులు అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతోందని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కాగా 30వ వార్డు నుండి చైర్ పర్సన్ అభ్యర్థిగా ప్రచారం పొందిన రొంటాల సుహాసిని కి వస్తుందని అనుకున్నారు. కానీ ఎన్నికల ఫలితాల అనంతరం కాంగ్రెస్ పార్టీలో మొదటి నుండి ఉన్న సొల్లు సునీత కు అవకాశం వస్తుందని ప్రచారం జరుగుతుండగా, 13వ వార్డులో గెలుపొందిన సందమల్ల పుణ్య కు అవకాశం వచ్చే విధంగా ఉందని మరొక ప్రచారం జరుగుతుంది. చైర్ పర్సన్ ఎస్సీ మహిళకు కేటాయించగా వైస్ చైర్ పర్సన్ పదవిని వద్లూరి శ్రీలేఖ కు గానీ, గూడూరి అంజలికి గాని లభించవచ్చని కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతుంది. ఎవరికివారు తమ వారే చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ పదవులు వస్తాయని భావిస్తుండడంతో ఆ రీతిలో అధిష్టానం పై ఒత్తిడి కూడా సంబంధిత నాయకులు పెడుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. కాగా హుజురాబాద్ మున్సిపాలిటీలో విజయం పొందిన కాంగ్రెస్







అభ్యర్థులంతా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ శివారులోని ఒక రహస్య ప్రాంతంలో క్యాంపు వేసినట్లు తెలుస్తుంది. కాగా హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జి వొడితల ప్రణవ్ బాబు సూచనలకు అనుగుణంగా ఎన్నిక జరిగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. చైర్ పర్సన్ రేసులో ముగ్గురు పేర్లు వినిపిస్తుండగా ఎవరికి వరించనుందో తెలియాలంటే సోమవారం వరకు ఆగాల్సిందే.

# కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి మున్సిపల్ ఫలితాలే నిదర్శనం

## - రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్

సూర్య, సెంటినరీ కాలనీ

సింగరేణి కోల్ బెల్ట్ వ్యాప్తంగా జరిగిన మున్సి పల్ మరియు కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి నిదర్శ మని తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్, ఐఎన్టీయూసీ జనరల్ సెక్రటరీ జనక్ ప్రసాద్ అన్నారు. సెంటినరీ కాలనీ లోని ఐఎన్టీయూసీ కార్యాలయంలో ఆర్జీ-3 వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. కోల్ బెల్ట్ పరిధిలోని 10 మున్సిపాలిటీలలో 9 స్థానాలను, అన్ని కార్పొరేషన్లలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజా ర్టీతో గెలవడం సింగరేణి కార్మికుల విశ్వాసానికి నిదర్శనమని తెలిపారు. రాబోయే 16వ తేదీన జరగనున్న మేయర్ ఎన్నికల్లో కూడా అన్ని మేయర్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ విజయానికి జాతీయ నాయకులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ మార్గదర్శకత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, స్థానిక ఎమ్మెల్యేల సమన్వయ నాయకత్వమే కారణమని అన్నారు. 2023 నుండి



జరిగిన బైఎలక్షన్లు, లోక్‌సభ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలు సహా ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిందని, గత 10 సంవత్సరాలు పాలించిన బిఆర్ఎస్ పార్టీకి ఈ ఎన్నికల్లో 15 శాతం ఓట్లు కూడా రాలేదని గుర్తు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కొన్ని కార్పొరేషన్లలో కొంత మెరుగైన ఫలితాలు సాధించినప్పటికీ ఒక్క మున్సిపాలిటీ కూడా గెలవలేకపోయిందని విమర్శించారు. ఐఎన్టీయూసీ జాతీయ అధ్యక్షుడు డా. జి. సంజీ వ రెడ్డి సూచనల మేరకు తెలంగాణలోని 60 లక్షల ఐఎన్టీయూసీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు అందించారని, ముఖ్యంగా సింగరేణి ప్రాంతంలో ఐఎన్టీయూసీ కార్మిక నాయకులు అభ్యర్థుల విజయానికి కీలకంగా పని చేశారని పేర్కొన్నారు. సింగరేణిని సర్వనాశనం చేసిన బిఆర్ఎస్ నాయకులు సింగరేణి కార్మికులకు తమ పాలనలో ఏమి చేసారో చర్చకు రావాలని సవాల్ విసిరారు. మంథని మున్సిపాలిటీలో దుద్దిళ్ల శ్రీను బాబు, రామ గుండం కార్పొరేషన్‌లో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్, మంచిర్యాల మున్సిపాలిటీలో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, బెల్లంపల్లి మున్సిపాలిటీలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ సమన్వయం విజయానికి కీలకమని అభినందిం చారు. అలాగే ఈ ఎన్నికలు పేపర్ బ్యాలెట్ ద్వారా జరిగినట్లు పేర్కొంటూ, భవిష్యత్‌లో జరగనున్న లోక్‌సభ ఎన్నికలు కూడా ఈవీఎం లకు బదులుగా పేపర్ బ్యాలెట్ ద్వారా నిర్వహిస్తే రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత భారీ మెజారిటీతో విజయం సాధిస్తుం దని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం జీఎం కార్యాలయంలో జీఎం సుంకర మధు సూదన్ ని కలిసి స్థానిక సమస్యలను వివరించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు నరసింహ రెడ్డి, ధర్మపురి, జనరల్ సెక్రటరీ వికాస్ కుమార్ యాదవ్, వైస్ ప్రెసి డెంట్ దాస్, సదానందం, కొత్త సత్యనారా యణ రెడ్డి, రీజినల్ జనరల్ సెక్రటరీ ఆరేపల్లి శ్రీని వాస్, నాయకులు వెంకటస్వామి, సందెల కుమా ర్,జుబైర్, ఉడుత శంకర్, కిరణ్ రెడ్డి, సందీప్, మొగిలి, పందు, తదితరులు పాల్గొన్నారు.

# రుద్రంగిలో ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

## - హై కోర్టు ఆదేశాలతో ఆగిన అక్రమ కట్టడాలు మళ్ళీ మొదలు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేసిన అఖిలపక్షం నాయకులు

## - అధికారులు, ప్రజాప్రతినిధుల అండదండలతోనే అక్రమ కట్టడాలని ఆరోపణ

సూర్య రుద్రంగి

రుద్రంగి మండల కేంద్రంలోని గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించి, అక్రమ నిర్మాణాలను అరికట్టాలని రుద్రంగి మండల కేంద్రంలో అఖిలపక్షం బీఆర్ఎస్, బీజేపీ, బిఎస్పీల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి అధికారులను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పరిధిలో బస్టాండ్ ప్రాంతంలో సర్వే నెంబర్ 428/2, 428/3, 428/4 మూడు సర్వే నెంబర్లలోని ఎకరం ముప్పై రెండు(1-32) గుంటలు గల ప్రభుత్వ భూమిని 1999 సంవత్సరంలో రెవెన్యూ అధికారులు గ్రామపంచాయతీ అభివృద్ధికి కేటాయించడం జరిగిందన్నారు. కానీ అట్టి భూమిలో ఇప్పుడు కొందరు ప్రైవేట్ వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు స్థలం లేక ప్రైవేట్ బిల్డింగ్‌లలో ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ భూమిలో చేస్తున్న అక్రమ నిర్మాణాలను ఆపివేయాలని హైకోర్టు తీర్పు ఇవ్వడం జరిగిందని, ఇప్పుడు ఎవరి అండదండలతో నిర్మాణం చేపడుతున్నారో ప్రజలు గమనిస్తున్నారన్నారు. అభివృద్ధి పేరుతో సర్వే చేసి రైతుల భూములను తీసుకోవడం మానేసి గ్రామంలోని నడి బోడ్డున కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరారు. సమగ్ర విచారణ చేపట్టాలని తెలుపగా విచారణ చేపట్టి సర్వే నిర్వహించి ఎకరం ముప్పై రెండు గుంటలు గల ప్రభుత్వ భూమిని గుర్తించి హద్దులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అట్టి ప్రభుత్వ భూమి చుట్టూ హద్దు కంచె లేదా ఫెన్సింగ్ ఏర్పాటు చేయలన్నారు. ఇప్పటికైనా అట్టి భూమిలో హద్దులను నిర్ణయించాలన్నారు. ప్రైవేట్ వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేపడుతుంటే అధికారులు గాని ప్రజాప్రతినిధులు పట్టించు కోవడం ఆరోపించారు. ఇప్పటికైన ప్రభుత్వ భూమిలో చేస్తున్న అక్రమ నిర్మాణాలను నిలిపి వేసి వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, అధికారులను కోరారు. ఈ కార్యక్ర మంలో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, నాయ కులు గంగం మహేష్, కర్ణవత్తుల వేణు, చెప్యాల గణేష్, ఉప్పులూటి గణేష్, దుబ్బ రవి, గండి శ్రీనివాస్, కాదాసు లక్ష్మణ్, అరుణ్, బాలకిషన్, నర్సింగారావు, ఉదయ్, నరేష్,గంగాధర్, గంగరెడ్డిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర రాజధానికి వెళ్లిన కాంగ్రెస్ కార్పొరేటర్లు

## - మ్యాజిక్ ఫిగర్ దాటినప్పటికీ కాంగ్రెస్ గూటికి చేరుతున్న ప్రతిపక్ష పార్టీల కార్పొరేటర్లు

## - మేయర్ రేసులో మహంకాళి స్వామి ముందంజ?

సూర్య-గోదావరిఖని:

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నిక ల్లో అధికార కాంగ్రెస్ పార్టీ 38 డివిజన్ లలో మూడు రంగుల జెండా ఎగురవేసి మేయర్ ఎన్నికకు కావలసిన మ్యాజిక్ ఫిగర్ దాటినప్పటికీ శనివారం కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు హైదరాబాద్ కు కుటుంబ సభ్యులతో కలిసి క్యాంపుకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఇదే రోజు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మనవరాలు నామకరణ మహోత్సవం ఉండడంతో ఇక్కడికి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కూడా హైదరాబాదుకు తరలి వెళ్లారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు హైదరాబాద్‌లో పార్టీ అధిష్ఠానంతో కీలక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం.దాదాపు మేయర్ అభ్యర్థిగా మహంకాళి స్వామి పేరు ప్రధానంగా వినిపిస్తుండగా మరి కొంతమంది కూడా ఆశపడుతున్నట్లు తెలుస్తోంది. మహంకాళి స్వామికి పార్టీ వర్గాల్లోనూ, కార్పొరేటర్లలోనూ మద్దతు బలంగా ఉండటమే కాకుండా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, మంత్రి శ్రీధర్ బాబు ఆశీస్సులు పుష్కలంగా ఉండడంతో దాదాపుగా మేయర్ పీఠాన్ని అధిరోహించేది స్వామి అని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. మ్యాజిక్ ఫిగర్ దాటినప్పటికీ బీఆర్ఎస్ నుంచి అడ్డాల గట్టయ్య, కజంపురం జయప్రద, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి గెలిచిన పుష్పలత, చీదురాల నాగరాజు, వద్లూరి రవి, తిరుపతి గౌడ్, కర్రావుల దాడి రాజు కాంగ్రెస్ పార్టీలో చేరారు. 8 మంది తాజాగా కాంగ్రెస్ పార్టీలో చేరడంతో 38 సంఖ్య కాస్త 46 కు చేరింది. సోమవారం మేయర్ ఎన్నికకు సంబంధించిన సమావేశం ప్రారంభం ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జరగనుండగా అదే రోజు కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు హైదరాబాద్ నుంచి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అప్పటివరకు మేయర్ అభ్యర్థి ఎవరు అనేది సస్పెన్షన్ లో ఉంచడం జరుగుతుందని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అనుచరులు చెపుతుండడంతో రామగుండం రాజకీయ వర్గాలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి.



# పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన సిరిసిల్ల పద్మశాలి సంఘం

సూర్య సిరిసిల్ల టౌన్

సిరిసిల్ల మున్సిపాలిటీకి పద్మశాలి కౌన్సిలర్ గా గెలిపించిన సిరిసిల్ల పద్మశాలి కుల బాంధవులకు, అన్ని వర్గాల ప్రజలకు పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దూడం శంకర్, మండల సత్యంలు కృతజ్ఞతలు తెలిపారు.సిరిసిల్ల పద్మశాలి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దూడపు శంకర్,మండల సత్యంలు మాట్లాడుతూ సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 39 వార్డులకు 22 మంది పద్మశాలి కౌన్సిలర్లను గెలిపించిన కుల బాంధవులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ ఎన్నికల్లో మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్ స్థానాన్ని పద్మశాలీలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగానే అత్యధిక జనాభా కలిగిన పద్మశాలి లకే రెండు పదవులు అప్పగిస్తే మరింత మాకు సేవ చేసే భాగ్యం కలుగుతుందని అన్నారు.నేడు జరిగే మహాశివరాత్రికి సిరిసిల్ల మార్కండేయ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నమని పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై లింగోద్భావ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గాజుల బాలయ్య,మోర రవి,సహాయ కార్యదర్శి ఎల్లె శ్రీనివాస్,కోశాధికారి కోడం శ్రీనివాస్,డైరెక్టర్లు పాల్గొన్నారు.



# అష్టాంగ యోగాతో చింతలేని ఆరోగ్య జీవితం,మానసిక ప్రశాంతత

**- యోగ గురువు శ్రీకోటి కళింగరాజు**

**సూర్య జూలపల్లి**



అష్టాంగ యోగాతో చింతలేని ఆరోగ్య జీవితం, మానసిక ప్రశాంతత కలుగుతుందని శ్రీకృష్ణ కష్టాంగ యోగ గురువు శ్రీకోటి కళింగరాజు అన్నారు.ఆరోగ్యమే మహాభాగ్యం ఇది ఎవరూ కాదనలేని నిజం ధనం,హోదా,అష్టైశ్వర్యాలుండీ.. ఆరోగ్యం లేకపోతే సర్వం బూడిదలో పోసిన పన్నీరే ఉరుకుల పరుగుల జీవితం మారిన ఆహారపు అలవాట్లు తీవ్ర ఒత్తిడి మనిషిని శారీరకంగా, మానసికంగా దెబ్బతీస్తున్నాయని అన్నారు.గత 11 రోజులుగా మండల కేంద్రంలో యోగా గురువు శ్రీ కోటి కళింగ రాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీకృష్ణ అష్టంగ యోగ శిక్షణ మూడవ బ్యాచ్ బుధవారం ముగిసింది. ఉదయం యోగ అభ్యాసకులు జూలపల్లి, అబ్బాపూర్ పురవీధుల గుండా ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించి ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రజలకు వివరించారు.యోగ అభ్యాసకులు గురుపూజోత్సవం నిర్వహించి గురువును సన్మానించి దక్షిణ సమర్పించారు. ఈ సందర్బంగా గురూజీ శ్రీకోటి కళింగరాజు మాట్లాడుతూ యోగా సాధకులు తాము పొందిన యోగా శిక్షణను నిత్య జీవితంలో ఆచరించి ఆరోగ్యంగా ఉండాలని, మానసిక ప్రశాంతతో గడిపేందుకు అష్టాంగ యోగా సాధన ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జ్ఞానంతో కూడిన ఆరోగ్య ప్రయోజనాలున్న అమృత ఆహారాన్ని తీసుకుని ఉత్తమ కర్మలను చేసి మోక్షం పొందాలని సూచించారు.ముగింపు సందర్భంగా అభ్యాసకులు 26 రకాల ప్రసాదాలు, నైవేద్యాలు స్వీకరించారు. ఫిబ్రవరి 22న నాలుగవ అభ్యసన శిబిరం మొదలవుతుందని, ప్రజలందరూ వినియోగించుకొని ఆరోగ్యంగా చింత లేకుండా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమరగాని మమత-ప్రదీప్ కుమార్, ఎలిగేటి శ్రీనివాస్, కనపర్తి రాజేందర్, దండే వెంకటేశ్వర్లు,బూరుగు శ్రీకర్,కచ్చు కొమురయ్య, పసునూటి శ్రీనివాస్,కొప్పుల మహేష్, పెద్దోళ్ల ఐలయ్య,పాతకుల అనిల్, గంగిపల్లి రవి, అందె శివప్రసాద్,దేవసాని రేణుక-శ్రీనివాస్, నగునూరి సురేష్,ముత్యాల వేణు,ఒల్లాజీ శ్రీనివాస్,కూసుకుంట్ల మోహన్ రెడ్డి, మామిడి శెట్టి శ్రీనివాస్,అందె శ్రీరాజ్,మల్లెత్తుల సంతోష్,ఖమ్మం సతీష్, గాండ్ల చంద్రయ్య పాల్గొన్నారు.

# కోరుట్ల తీర్పు కాంగ్రెస్‌కు మద్దతు

**- హామీల అమలే మా తొలి కర్తవ్యం**

**-జువ్వాడి కృష్ణారావు**



**సూర్య కోరుట్ల**

పట్టణ పురపాలక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు పట్టణ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ నెల 11న జరిగిన పురపాలక ఎన్నికల్లో కోరుట్ల ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పగించడం పట్ల ఆనందం వ్యక్తం చేసిన ఆయన, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని తప్పక అమలు చేస్తామని స్పష్టం చేశారు. కోరుట్ల పట్టణంలోని జువ్వాడి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, “పట్టణ ప్రజలు కాంగ్రెస్ పార్టీపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటాం. కోరుట్లను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తాం” అని పేర్కొన్నారు.ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపుకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల, భారీ మధ్య తరహా నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అందించిన సహకారాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు.గతంలో శాసన సభ్యుడిగా, మంత్రిగా ఉన్న సమయంలో జువ్వాడి రత్నాకర్ రావు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేసుకుంటూ, అదే దిశగా మళ్లీ పట్టణ అభి వృద్ధికి కట్టుబడి ఉంటామని అన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో కోరుట్లలో గణనీయమైన అభివృద్ధి జరగలేదని విమర్శించారు.మున్సిపల్ ఎన్నికల్లో కోరుట్ల, మెట్పల్లి పట్టణాలతో పాటు నియోజకవర్గంలోని గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అహర్నిశలు శ్రమించారని, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎల్లాల వెంకటరెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి రాజోజీ సదానందచారి, యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఏలేటి మహిపాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ సంఘ లింగం, డైరెక్టర్ భూస రాజేశ్వర్, మరిపెల్లి జనార్దన్, రంజిత్ గుప్తా, అబ్దుల్ ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.కోరుట్ల ప్రజలు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ పార్టీపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమని, ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం తమ బాధ్యత అని జువ్వాడి కృష్ణారావు స్పష్టం చేశారు.

# దామోదర సంజీవయ్య 105వ జయంతి

**సూర్య సిరిసిల్ల టౌన్**



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రథమ దళిత ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య 105వ జయంతి వేడుకలను సిరిసిల్లలో అన్ని వర్గాల ప్రజలు ఘనంగా నిర్వహించారు.ఉమ్మడి రాష్ట్ర ప్రథమ దళిత ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య 105వ జయంతి వేడుకలను సిరిసిల్ల పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో గల సంజీవయ్య విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు పూలమాలలు వేసి ఆయనకు ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దళిత ప్రథమ ముఖ్యమంత్రిగా పనిచేసి అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందించారని గుర్తు చేశారు.కేంద్రంలో మంత్రివర్గం లో పనిచేసి దేశ సంస్కరణలను అమలు చేశారని గుర్తు చేశారు.సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సంజీవయ్య నగర్ అన్ని రంగాలలో వెనుకబడి పోయిందని ఈ మున్సిపల్ ఎన్నికల్లో సంజీవయ్య నగర్ నుండి గెలుపొందిన అభ్యర్థికి వైస్ చైర్మన్ పదవి ఇవ్వాలని పలువురు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్,దళిత సంఘాల నేతలు రాగుల రాములు,కంసాల మల్లేశం,రాగుల జగన్,నెల్లుట్ల కనకయ్య,సోమిశెట్టి దశరథం తదితరులు పాల్గొన్నారు.

# కేనాల్ త్రవ్వకం పనులను వెంటనే చేపట్టాలి

**-12 గ్రామాల రైతుల దీక్ష కు వేల్జిపురం రైతుల మద్దతు**

**సూర్య. ఇల్లంతకుంట**



మండలం లోని పెద్ద లింగాపూర్ గ్రామ శివారులో కాళేశ్వరం ఆర్ డి,3-ఎల్ ఎం 6 కెనాల్ ద్వారా సాగునీటి కొరకు 12 గ్రామాల ప్రజలు చేపట్టిన నిరసన-రిలే నిరాహార దీక్ష శనివారం కు 4 వ రోజుకు చేరుకొంది. రైతులకు మద్దతు గామండలం లోని వెల్జీపురం రైతులు దేశెట్టి శ్రీ నివాస్ ,కంకణాల శ్రీనివాస్ రెడ్డి,ఓరెం భార్గవరెడ్డి, చిలువేరు వెంకటేష్ రెడ్డి తదితరులుతో కలిసి మద్దతు తెలిపారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వెంటనే సమస్యను పరిష్కించాలని డిమాండ్ చేశారు.దాదాపు రూ. మూడున్నర కోట్లు మంజూరు ఇప్పించి, ఒకటిన్నర కిలోమీటర్ల కెనాల్ తవ్వించి శాశ్వతంగా సాగు నీటి కరువును దూరం చేయాలని కోరారు.

# వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శివ కళ్యాణ వేడుకలు

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం సెంటినరీ కాలనీ లోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శివపార్వతుల కళ్యాణ వేడుకలు శనివారం ప్రారంభం అయ్యాయి. స్వామి వారి జోడు సేవల ఎదురుకోలు కార్యక్రమం జరిగింది. తోట శ్రీనివాస్-స్వాతి కి చెందిన కిరాణం దుకాణం నుండి ఎదురుకోలు కార్యక్రమం నిర్వహించారు. భక్తులందరు ర్యాలీగా వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంకు వెళ్లారు.

# పుల్వామా అమరులకు ఘన నివాళి

**సూర్య మల్లాపూర్**



ఫిబ్రవరి 14, 2019 పుల్వామా దాడిలో అమరులైన వీర జవాన్ ల ఆత్మకు శాంతి కలగాలని మండలంలోని రేగుంట గ్రామంలో శనివారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్, అంబేద్కర్ విగ్రహాల వద్ద రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా దేశ రక్షణ కోసం నిరంతరం సేవలందిస్తున్న జవాన్‌ల సేవలు వెలకట్టలేనివన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేష్, మల్లేష్, రామగౌడ్, తిరుపతి రెడ్డి, రాజన్న, శ్రీనివాస్ రెడ్డి, మహ్మద్ బషీర్, తిరుపతి గౌడ్, రాజరెడ్డి, నరేష్ గౌడ్, సుధాకర్, రాకేష్, నరేష్, రాజు, అశోక్, నవీన్, వినోద్ తదితరులు పాల్గొన్నారు .

# రామోజీలో రత్నాపూర్ విద్యార్థులు

**సూర్య, సెంటినరీ కాలనీ**




రామగిరి మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు శనివారం విహారయాత్రకు వెళ్లారు. విద్యార్థులకు జ్ఞానం పెంపొందించే ఉదేశ్యం తో విహారయాత్రకు తీసుకువెళ్లారు. హైదరాబాద్ లోని రామోజీ ఫిలిం సిటీ లో పర్యటించారు. ఫిలిం సిటీ లోని పరిసరాలను తిలకించారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు బుర్రి శ్యామ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు విహారయాత్రకు వెళ్లారు.

# పుల్వామా అమర జవాన్లకు ఘన నివాళులు

**సూర్య వెల్గటూర్**



పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన జవాన్లకు ఉపసర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షుడు గంద్ర ప్రతాప్ రావు,వెల్గటూర్ మాజీ సర్పంచ్ మెరుగు మురళీ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల తో ఘన నివాళులు అర్పించారు.దేశం కోసం వారు చేసిన సేవలు,ప్రాణత్యాగం ఎప్పటికి గుర్తుండిపోతాయని ఈ సందర్భంగా స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ గుండాటి సందీప్ రెడ్డి,బి సి సెల్ మండల అధ్యక్షుడు బందెల ఉదయ్ గౌడ్, వార్డు సభ్యులు నక్క సురేష్,కస్తూరి సుమలత మల్లేష్,పెద్దూరి భరత్ కుమార్,వెళగందుల సంతోష్,గుమ్ముల అజయ్, బొడ్డు సంతోష్, గాలిపెల్లి మహేష్,నరేష్,బోడకుంటి తిరుపతి, బోడకుంటి శ్రీనివాస్, రేగుంట నర్సయ్య, లకుమల్ల సాయి తదితరులు పాల్గోన్నారు.

# ఆక్స్ఫర్డ్ విద్యార్థుల విజ్ఞాన యాత్ర

**- విజ్ఞాన యాత్రతో విద్యార్థుల్లో సృజనాత్మకత మానసిక ఉల్లాసం**

**- రామప్ప దేవాలయం సందర్శించిన ఆక్స్ఫర్డ్ పాఠశాల విద్యార్థులు**

**సూర్య గంభీరావుపేట**



విజ్ఞాన యాత్రలో భాగంగా గంభీరావుపేట మండల కేంద్రంలోని ఆక్స్ఫర్డ్ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు వరంగల్ జిల్లాలోని చారిత్రక యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం సందర్శించారు. అక్కడ కాకతీయుల కాలం లో నిర్మించిన రామప్ప దేవాలయ చరిత్ర, శిల్పకళ వైవిధ్యాన్ని పరిశీలించి, ప్రతిమల దృశ్య కళను, దేవాలయ నిర్మాణం లో ఉపయోగించిన తేలికపాటి ఇటుకలు మరియు శాస్త్రీయ సాంకేతికత గురించి గైడ్ సహాయంతో తెలుసుకున్నారు.ఈ విజ్ఞాన యాత్ర పై పాఠశాల ప్రిన్సిపాల్ సంతోష్ రెడ్డి మాట్లాడుతూఇలాంటి విజ్ఞాన యాత్రల వల్ల విద్యార్థుల్లో విజ్ఞానంతో పాటు సృజనత్మకత, మానసిక ఉల్లాసం పెంపొందుతుందని పేర్కొన్నారు. ఈ విజ్ఞాన యాత్ర కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతులకు 50శాతం సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు పంపిణీ

**- రైతులకు పనిముట్లు పంపిణి చేస్తున్న ఏఎంసి చైర్మన్ కోమిరిశెట్టి విజయ, సర్పంచ్ మల్లుగారి పద్మ**

**సూర్య, గంభీరావుపేట**

ప్రజా ప్రభుత్వం ఏర్పాటులో అన్నదాతల పాత్ర మరువలేనిదని గంభీరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొమిరిశెట్టి విజయ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మల్లు గారి పద్మ,ప్రజా ప్రతినిధులు అధికారులు నాయకులతో కలిసి 50శాతం సబ్సిడీపై మంజూరైన రెండు ట్రాక్టర్ కల్టీ వెటర్లు,రెండు బ్రష్ కట్టర్లు, ఒకటి పవర్ స్ప్రేయర్ వ్యవసాయ పనిముట్లను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులను ఆదుకోవడానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. మండలంలోని రైతులు అవసరమున్న పనిముట్లను అప్లై చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మల్లు గారి పద్మ-నర్సయ్య గౌడ్ ఉప సర్పంచ్ కమలాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి మండల అధ్యక్షుడు హమీద్ వ్యవసాయ అధికారి సలావుద్దీన్, ఏఈఓలు అజయ్, ముకుంద్, ప్రవీణ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఏడబోయిన ప్రభాకర్, గెరిగంటి రాజా నర్సు నాయకులు రైతులు పాల్గొన్నారు.




# యాసంగి పంటకు పెట్టుబడి వెంటనే విడుదల చేయాలి

**- మండల బిజెపి అధ్యక్షులు భూమళ్ళ అనిల్ కుమార్**

**సూర్య, ఇల్లంతకుంట**

అమలు కానీ ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాల రెండు నెలలు అవుతున్న ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తూనే వుందని, రైతులపై చిత్త శుద్ధి వుంటే వెంటనే యాసంగి పంటకు పెట్టుబడి సాయం విడుదల చేసి నిరూపించుకోవాలని మండల బిజెపి అధ్యక్షులు భూమల్ల అనిల్ కుమార్ డిమాండ్ చేశారు.శనివారం మండల పార్టీ కార్యాలయంలో సమావేశం జరిగిన అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో నమ్మి మోసపోయిన వాళ్ళలో రైతులే ముఖ్యంగా ఉన్నారన్నారు. రైతులకు రైతు భరోసా పేరుతో రూ. 15వేలు ఇస్తానని, కౌలు రైతులకు సంవత్సరానికి రూ. 12వేల



చొప్పున ఇస్తానని,బోనస్‌గా సన్న రకానికి రూ. 500 ఇవ్వడం లేదన్నారు. పంట పెట్టుబడి సహాయంగా రైతుకు అందాల్సిన 2024 ఖరీఫ్ అమౌంట్ ఇప్పటివరకు అందలేదన్నారు. డిసెంబర్ జనవరి నెలలో జమ చేయవలసిన యాసంగి పెట్టుబడిసాయం వేయకపోగా, పరిషత్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మున్సిపల్ కార్పొరేషన్‌లో మాట్లాడుతూ సంబంధం లేకుండా రైతు భరోసా విషయం మాట్లాడారని గుర్తు చేశారు. రానున్న పరిషత్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని, రైతు భరోసా విషయాన్ని మళ్ళీ లేవనెత్తారని ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. రైతులు ప్రతి విషయాన్ని గమనిస్తున్నారన్నారుతక్షణమే రైతు పెట్టుబడి సాయం విడుదల చేయాలని, లేని పక్షంలో పార్టీ కార్యాచరణ అనుగుణంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మేకల మల్లేశం యాదవ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ బత్తిని సాయ గౌడ్, జిల్లా నాయకులు కొలనురు ముత్తవ్వ, నాయకులు పినికాసి అనిల్, భూత్ అధ్యక్షులు తుమ్మలపెల్లి కమలాకర్ రావు, పిల్లి గోపాల్ పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మనవరాలి నామకరణ మహోత్సవం

**- పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**సూర్య-గోదావరిఖని**



రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్-మనాలి ఠాకూర్ మనవరాలి నామకరణ మహోత్సవం శనివారం హైదరాబాదులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై శిశువుకు ఆశీస్సులు అందజేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారుడు హర్కర వేణుగోపాల్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఇంకా ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ముఖ్యమంత్రి సోద రులు, కుటుంబ సభ్యులు, ఆత్మీయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ శిశువు ఆరోగ్యంగా, ఆనందంగా ఎదగా లని ఆకాంక్షించారు. కుటుంబానికి తన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం సంప్రదాయ పద్ధతుల్లో నిర్వహించబడగా, ప్రత్యేక పూజలు, ఆశీర్వచనాలు జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ముఖ్య మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో ముగిసింది.

## రామగిరి ఖిల్లాలో సీపీ పర్యటన...

**సూర్య, సెంటినరీ కాలనీ**



రత్నాపూర్ గ్రామ పరిధి రామగిరి ఖిల్లాలో శనివారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పర్యటించినట్లు తెలిసింది. రామగిరి ఖిల్లా ప్రాధాన్యత, అక్కడి ప్రకృతిని చూడాలనే ఉద్దేశ్యంతో కుటుంబంతో పర్యటించినట్లు తెలిసింది.ఖిల్లాలోని వివిధ కట్టడాలను పరిశీలించినట్లు తెలిసింది. కెవికె కళాశా లను కూడా పరిశీలించినట్లు తెలిసింది.

## ఓటర్ల తీర్పుతో తనపై మరింత బాధ్యత పెరిగింది

**- ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతాం..**

**- ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు**

**సూర్య-ధర్మపురి**



ఓటర్లు ఇచ్చిన తీర్పుతో తనపై మరింత బాధ్యత పెరిగిందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి మున్సిపల్ పరిధిలోని 15 వార్డులకు గాను 15 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించిన సందర్భంగా శనివారం మంత్రి ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధర్మపురి నియోజకవర్గ ఓటర్లు 2023 లో జరిగిన శాసనసభ ఎన్నిక ల్లో తనను గెలిపిస్తే గడిచిన రెండు సంవత్సరాలుగా అనేక అభివృద్ధి శ్రీకారం చుట్టడంతో పాటు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు.గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మెజార్టీ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించిన ఓటర్లు మున్సిపల్ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను 100% గెలిపించడం సంతోషం అన్నారు. ఓటర్లు ఇచ్చిన తీర్పుతో తమపై మరింత బాధ్యత పెరిగిందని ధర్మపురి నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. వీరి వెంట బుగ్గారం మాజీ జెడ్పిటిసి బాదినేని రాజేందర్, నాయకులు స్తంభం కాడి రమేష్, సింహరాజు ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు ఉన్నారు.




## పద్మశాలి అభ్యర్థులను గెలిపించిన ఓటర్లకు ప్రత్యేక ధన్యవాదాలు

**- అనుమల్ల చంద్రమౌళి కొత్తపెల్లి మాజీ ఉపసర్పంచ్**

**సూర్య, కొత్తపల్లి**



17వ డివిజన్, 18వ డివిజన్‌లలో పద్మశాలి అభ్యర్థులు వేముల కవిత చంద్రశేఖర్ వాసాల రమేష్‌లను గెలిపించిన డివిజన్ ఓటర్లకు కొత్తపల్లి మాజీ ఉప సర్పంచ్ సామాజిక సేవకులు అను మల్ల చంద్రమౌళి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు. కొత్తపల్లి పట్టణంలో పద్మశాలీలు సత్తా చాటారని తెలిపారు. ఇంతటి ఘన విజయాలకు కృషి చేసిన ప్రతి ఒక్క ఓటరుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బిసి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## నాలుగు చేతి పంపుల మరమ్మతులు

**సూర్య-ఎలిగేడు**



మండల కేంద్రంలో శనివారం వేసవికాలం సమీపిస్తున్న నేపథ్యంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్ ఆధ్వర్యంలో పలు వార్డులకు సంబంధించిన చేతి పంపుల మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. వేసవిలో మంచినీటి కొరత ఎదురుకాకుండా గ్రామంలోని పనిచేయని చేతి పంపులను గుర్తించి మరమ్మతులు చేయిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు మధు, కార్తీక్, నరేందర్, ప్రశాంత్‌తో పాటు గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాల ప్రాంతంలో ఐమాక్స్ లైట్లు ఏర్పాటు

**సూర్య పెగడపల్లి**



మండలంలోని నంచర్ల గ్రామంలో శనివారం ప్రభుత్వ పాఠశాల ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐమాక్స్ లైట్లును గ్రామ సర్పంచ్ కుంటాల వనజ శ్రీనివాస్ ప్రారంభించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఆరవ వార్డులో పాఠశాల పరిసర ప్రాంతాలలో విద్యార్థులు, స్థానికుల సౌకర్యార్థం ఐమాక్స్ లైట్స్ ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎడ్ల శ్యాంసుందర్ రెడ్డి, వార్డు సభ్యులు మహేందర్, రాధా రాయమల్లు, సురేష్, ఎలక్ట్రిషన్ రాము పాల్గొన్నారు.

## మల్లన్న గుడికి విరాళాలు ఇచ్చిన రైతులు

**సూర్య చందుర్తి**



చందుర్తి మండల కేంద్రంలోని స్థానిక ఎల్లమ్మ దేవాలయం ఆవరణలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మల్లన్న స్వామి ఆలయ నిర్మాణానికి చందుర్తి మండల కేంద్రానికి చెందిన రైతు మర్రి లక్ష్మి రాజం 1,01,116 రూపాయలు మండల కేంద్రానికి చెందిన తిప్పని మీసేవ శ్రీనివాస్ 10,116 రూపాయలు అలాగే మండల కేంద్రానికి చెందిన బీడీ కంపెనీ టేకేదర్ అల్లె రాములు 5,016 రూపాయల విరాళాలను ఆలయ కమిటీ సభ్యులకు శనివారం రోజున అందజేశారు ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కత్తి తిరుపతి గుగ్గిల గంగాధర్ లు మాట్లాడుతూ గౌడ కులస్తుల ఆధ్వర్యంలో ఎల్లమ్మ దేవాలయ ఆవరణలో నిర్మిస్తున్న మల్లన్న స్వామి ఆలయానికి చందుర్తి మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల వారు అలాగే ఎన్నారైలు గుడి నిర్మాణంలో భాగస్వాములు అవుతూ ఆలయ నిర్మాణం సులువుగా అయ్యేందుకు దాతలు ముందుకు వచ్చి సహకరిస్తున్నారని వారి వారి కుటుంబాలపై స్వామి వారి కృపాకటాక్షములు ఉంటాయని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో మర్రి లక్ష్మి రాజం కుటుంబ సభ్యులు మర్రి సాయి,మర్రి సునీల్,శీను కుటుంబ సభ్యులు పల్లె రాములు కుటుంబ సభ్యులు ఆలయ కమిటీ సభ్యులు గౌడ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం

**సూర్య ధర్మపురి**

జగిత్యాల జిల్లా ధర్మపురి గోదావరిలో శనివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్టు ధర్మపురి ఎస్సై జి మహేష్ తెలిపారు. మృతుని వయసు సుమారు 45 నుండి 50 సంవత్సరాలు ఉండవచ్చునని, మృతుని శరీరంపై నలుపు రంగు బనియన్, బ్రౌన్ కలర్ ప్యూమా గుర్తులున్న షాట్ ధరించి ఉన్నట్టు ఆయన తెలిపారు. గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.



# విద్యార్థులు లక్ష్యంపై దృష్టి పెట్టాలి...

**- చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి...**

**సూర్య బోధన్**

నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని బోధన్ డివిజన్లోని బోధన్ పట్టణ కేంద్రంలోని రమాకాంత్ ఫంక్షన్ హాల్‌లో నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ యువతకు డ్రగ్స్ (మాదక ద్రవ్యాలు) పై విస్తృతంగా అవగాహన కల్పించారు. డ్రగ్స్ వాడకం వ్యక్తిగత జీవితానికే కాదు కుటుంబాలకు, సమాజానికి కూడా తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తుందని చెప్పారు. డ్రగ్స్ పై విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ చేశారు. సరదాగా లేదా స్నేహితుల ప్రలోభాలకు లోనై మొదలయ్యే ఈ అలవాటు క్రమంగా వ్యసనంగా మారి చదువు, కెరీర్, భవిష్యత్తు అన్నింటినీ నాశనం చేస్తుందని హెచ్చరించారు. డ్రగ్స్ కారణంగా ఆరోగ్య సమస్యలు, మానసిక




అస్థిరత, ఆర్థిక ఇబ్బందులు వస్తాయని వివరించారు. మత్తు పదార్థాల ప్రభావంతో యువత తప్పు మార్గాల్లోకి వెళ్లి నేరాలకు పాల్పడే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. డ్రగ్స్ సరఫరా చేయడం, వాడడం లేదా వాటికి సహకరించడం కూడా చట్టపరంగా నేరమని స్పష్టం చేశారు. విద్యార్థులు తమ లక్ష్యాలపై దృష్టి పెట్టి, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా పిల్లల ప్రవర్తనలో మార్పులను సమయా నికి సలహా ఇవ్వాలని కోరారు. "డ్రగ్ ఫ్రీ తెలంగాణ" సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాము లవ్వాలని పిలుపునిచ్చారు. అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం ఇవ్వడానికి లేదా సహాయం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1098ను సంప్రదించాలని సూచిం చారు.ఇట్టి కార్యక్ర మంలో నార్కోటిక్స్ , సైబర్ సెక్యూరిటీస్ , మహిళల భద్రత నిర్వహణ కోసం విద్యార్థులకు క్షుణ్ణంగా అవగాహన కల్పించారు.కార్యక్రమంలో నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ జనరల్ సెక్రెటరీ కవితా రెడ్డి, ట్రెజరర్ కేతం సంతోష్, జాయింట్ సెక్రటరీలు దుష్యంత్, డాక్టర్ శిరీష్, హితిన్ భీమాని, డాక్టర్ ఉషారాణి ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ కొడాలి కిషోర్, సాంబిరెడ్డి, బోధన్ ఎసిపి శ్రీనివాస్, బోధన్ ఎస్హెచఓ వెంకటనారా యణ, బోధన్ రూరల్ సిఐ విజయబాబు, రుద్రూర్ సిఐ కృష్ణ, ఎస్సైలు భాను ప్రకాష్, సందీప్ నార్కోటిక్, మనోజ్, మహేష్, భాస్కర్, మచ్చేందర్ రెడ్డి 1500 మంది కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

## మల్యాల ఎక్స్ రోడ్ లో ఆల్ఫోర్స్ (ఎన్ ఎస్ వి) పాఠశాలలో

# ముందస్తు మహా శివరాత్రి వేడుకలు

**సూర్య మల్యాల**




మల్యాల ఎక్స్ రోడ్‌లో గల ఆల్ఫోర్స్(ఎన్ ఎస్ వి) పాఠశాలలో ముందస్తుగా మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ , మహాశివరాత్రి శివుడు-పార్వతీ దేవి ఐక్యతకు, ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీక అని తెలిపారు. ఈ పవిత్ర రాత్రి జాగరణ చేయడం, శివలింగానికి బిల్వదళార్చన చేయడం, రుద్రాభిషేకం నిర్వహించడం వలన మానసిక ప్రశాంతత, పాప విముక్తి, సర్వసౌఖ్యాలు కలుగుతాయని విశ్వాసమన్నారు. ఈ పర్వదినాన దేశవ్యాప్తంగా, ముఖ్యంగా తెలంగాణలోని వివిధ శివాలయాలు ప్రత్యేక పూజలతో భక్తులతో కిటకిటలాడుతాయని పేర్కొన్నారు.పాఠశాలలో నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు శివుడు, పార్వతీ దేవి వేషధారణలో పాల్గొని, శివలింగానికి పూజలు నిర్వహిస్తూ భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్,అనూష ఉపాధ్యాయులు విద్యార్థులుతదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో ఓసిల మహా ధర్నాను విజయవంతం చేయాలి

**-రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి**

**సూర్య జగిత్యాల అర్బన్**



ఓసి ల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఈ నెల 23 న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జాతీయ స్థాయి ఓసి ల మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు ఓసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, జగిత్యాల జిల్లా కన్వీనర్ మహంకాళి రాజన్నలు తెలిపారు. ధర్నా పోస్టరును శనివారం ఓసి సామాజిక సంక్షేమ సంఘాల సమాఖ్య నాయకులు జగిత్యాల లో ఆవిష్కరించారు. ఈసందర్భంగా కిషన్ రెడ్డి, రాజన్న లు దేశవ్యాప్తంగా ఓసిల స్థితిగతులను అధ్యయనం చేసి జాతీయ స్థాయిలో ఓసి కమిషన్ ఏర్పాటు చేయాలనీ డిమాండ్ చేశారు. మాట్లాడుతూ అగ్రవర్ణాల్లోని ఆర్థికంగావెనుకబడి ఉన్నవారు రిజర్వేషన్ల లేమి కారణంగా అటు సంక్షేమ పథకాలఫలాలు ఇటు రాజకీయ పదవులు పొందలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. .రాజ్యాంగ బద్ధంగా ఏర్పడ్డ 10శాతం ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ల పై రాజకీయ పబ్బం కోసం కొందరు ఆయా కులాల్లోని ప్రజలను మభ్య పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఓసి జేఏసీ జగిత్యాల జిల్లా ఓసి నాయకులు సిరిసిల్ల వేణుగోపాల్, సిరిసిల్ల రాజేందర్ శర్మ, సంత గౌతమ్ రెడ్డి, పుల్లూరి సత్యనారాయణ, మేతే ఉమాపతి శర్మ, కటకం చంద్రమౌళి, అయిల్నేని స్వప్న రావు, దేవరశెట్టి జనార్దన్,బండారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అనంతగిరిలో అంగరంగ వైభవంగా శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం

**సూర్య, ఇల్లంతకుంట.**





మండలంలోని అనంతగిరి గ్రామంలో అంగరంగ వైభవంగా శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం సర్పంచ్ అరుకాల నవీన్ కుమార్, ఇల్లంతకుంట ఏ ఎం సి చైర్మన్ ఐరెడ్డి చైతన్య మహేందర్ రెడ్డి ల ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు.శనివారం ఉదయం నుండీ ఆలయ ఆవరణలో కళ్యాణ మహోత్సవం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య జరిగిన కళ్యాణం వేడుకలో ఉపసర్పంచ్ తిప్పరవేణి బాలకిషన్, వార్డు మెంబర్లు, టెంపుల్ డైరెక్టర్లు, గ్రామ పెద్దలు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారి కళ్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ అందజేశారు.

## రాష్ట్ర స్థాయి సీఎం కప్ కబడ్డీకి బాణపూర్ యువకుడు ఎంపిక

**సూర్య,లింగంపేట్**



లింగంపేట్ మండలంలోని బాణపూర్ గ్రామానికి చెందిన యువకుడు బరిగే కృష్ణ రాష్ట్ర స్థాయి సీఎం కప్ కబడ్డీకి ఎంపిక కావడంతో బాణపూర్ గ్రామస్తులు శనివారం యువకున్ని శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. లింగంపేట్ మండల కేంద్రంలో నిర్వహించిన మండల స్థాయి సీఎం కప్ కబడ్డీ క్రీడాల్లో కృష్ణ పాల్గొని కబడ్డీలో మంచి ఆట నైపుణ్యం ప్రదర్శించి డివిజన్ స్థాయి సీఎం కప్ కబడ్డీకి ఎంపికైనారు.డివిజన్ స్థాయి కబడ్డీలో తన ఆట ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి సీఎం కప్ కబడ్డీకి ఎంపికయ్యా రు.జిల్లా స్థాయి కబడ్డీ ఆటలో తన ఆట నైపుణ్యం కనబరిచి చూపరులను ఆకట్టుకుని కబడ్డీ ఆటలో శభాష్ అనిపించుకొని అధికారుల మన్నలు పొంది రాష్ట్ర స్థాయి సీఎం కప్ కబడ్డీకి ఎంపికయ్యారు.రాష్ట్ర స్థాయిలో కామారెడ్డి జిల్లా తరపున కబడ్డీ ఆడడానికి ఈ నెల 20 న హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఆడనున్నారని గ్రామస్థులు తెలిపారు.రాష్ట్ర స్థాయి సీఎం కప్ కబడ్డీకి ఎంపిక కావడంతో గ్రామస్తులు,మండల నాయకులు,అధికారులు, యువకున్ని అభినందించారు.యువకున్ని సన్మానించిన వారు గోపాల రాములు,దురశెట్టి రవి,రాకేష్,సంజయ్,భానుప్రసాద్,ఉన్నారు.

## ల్యాబ్ టెక్నీషియన్ల నూతన కార్యవర్గం ఎన్నిక

**సూర్య కరీంనగర్**



ప్రభుత్వ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ల అసోసియేషన్ కార్యవర్గాన్ని జిల్లా స్థాయి సమావేశంలో తెలంగాణ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆఫ్తాబ్ అహ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా రఫీ మహమ్మద్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా హరీష్, జనరల్ సెక్రెటరీగా ప్రవీణ్ కుమార్, డిస్ట్రిక్ ట్రెజరర్ ఎర్ల రాకేష్, చీఫ్ అడ్వైజర్ శివ క్రిష్ణ, అసోసియేట్ ప్రెసిడెంట్ స్వప్న, వైస్ ప్రెసిడెంట్ సంజీవ్ కుమార్, శ్రీకాంత్, జాయింట్ సెక్రెటరి సంపత్, కిరణ్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరి వెంకటేశ్వర్లు, అనిల్ కుమార్, మీడియా పబ్లిసిటీ శ్రీనాథ్, ఈసీ మెంబర్స్ రూహి, కరుణాకర్, సంపత్ కుమార్, గోపాల్, అనిల్ లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్-1 యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ కర్ణ, ఆర్గనైజషన్ సెక్రటరి చంద్రమౌళి, రాష్ట్ర అబ్జర్వర్ రవీందర్, సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మహ్మద్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరులకు కొవ్వొతులతో నివాళి

**సూర్య చందుర్తి**



పుల్వామా దాడి జరిగి ఏడు సంవత్సరాలు అవుతున్న సందర్భంగా అమరవీరులకు చందుర్తి మండలం మల్యాల గ్రామంలోని యువకులు బస్టాండ్ ఆవరణలో క్యాండిల్ తో ఘన నివాళి అర్పించారు ఈ సందర్భ ంగా వారు మాట్లాడుతూ 2019 ఫిబ్రవరి 14న జమ్మూ కశ్మీర్‌లోని పుల్వామా ప్రాంతంలో సిఆర్‌పిఎఫ్ జవాన్లపై తీవ్రవాదులు భీకర దాడి చేయడంతో 40 మంది జవాన్లు అమరులయ్యారు. ఈ ఘటనలో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. అమరుల త్యాగాన్ని ఎప్పటికీ మరిచి పోదని, భద్రతా దళాలకు దేశ ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారని తెలిపారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొవడానికి సైనికులు తమ ప్రాణాలు పణంగా పెట్టారని, వారి త్యాగాన్ని గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు గ్రామ సర్పంచ్ శారద వార్డు సభ్యులు యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

# అందమైన చేతిరాత దివ్యమైన భవిత!

**- లుసిడా చేతిరాతలో రాష్ట్రస్థాయిలో జూపిటర్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ**

**- కరెస్పాండెంట్ అందె కుమారస్వామి అభినందన**

**సూర్య జూలపల్లి**




అందమైన చేతిరాతలో మండల కేంద్రంలోని జూపిటర్ హైస్కూల్ విద్యార్థులు గుమ్మడి హన్విత,కోడూరి అన్వితలు అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచినందుకు శనివారం హైదరాబాద్ గాంధీభవన్ ట్రస్ట్ కాంప్లెక్స్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ , ప్రో. కోదండరామ్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.ఈ సందర్భంగా కరెస్పాండెంట్ అందె కుమారస్వామి విద్యార్థులను అభినందించి అనంతరం మాట్లాడుతూ అందమైన చేతిరాత, మంచి మనసుకు ప్రతిబింబమని,రాళ్లపైన అక్షరాలు చెక్కిన రాతియుగం నుంచి పేపర్‌పై పెన్నుతో అక్షరాలు రాసే నేటి కంప్యూటర్ యుగం దాకా చేతిరాత ఎన్నో మలుపులు తిరుగుతూ వస్తోంది. ప్రపంచంలో ఏ ఇద్దరి చేతిరాత ఒకేతీరుగా ఉండదు. రాయడంలో ఎవరి శైలి వారిదే అక్షరాలను ముత్యాల్లా రాసేవారు కొందరైతే మరికొందరు కొంగలు తొక్కిన రీతిలో గజిబిజిగా రాస్తారు.నారాత నాఇష్టం అనుకోకుండా విద్యార్థులు చక్కటి రాతతో మంచి మార్కులు సాధించాలని అందమైన రాత ఉంటే మంచి భవిష్యత్తు పొందుతారని చిన్నవయస్సు నుండే అక్షరాలను గుండ్రంగా రాయడం సాధన చేయాలన్నారు.పరీక్షల్లో అందమైన చేతిరాతతో జవాబులు రాస్తే 10 శాతం మార్కులు అదనంగా సాధించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య భాగస్వాములు కొట్టే సంజీవ్,కుంటూరి మల్లేశం పాల్గొన్నారు.

# బీజేపీలో చేరిన మరో ఇద్దరు ఇండిపెండెంట్ కార్పొరేటర్లు

**- కేంద్ర మంత్రి బండి సంజయ్ సమక్షంలో చేరిన 17, 39వ డివిజన్ కార్పొరేటర్లు**

**- కాషాయ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించిన బండి సంజయ్**

**- బీజేపీతో సంప్రదింపులు చేస్తున్ మరో ఆరుగురు కార్పొరేటర్లు**

**- మేయర్ ఎన్నిక నాటికి బీజేపీ బలం అనూహ్యంగా పెరిగే అవకాశం**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థులుగా పోటీ చేసి గెలుపొందిన ఇద్దరు కార్పొరేటర్లు కొద్దిసేపటి క్రితం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సమక్షంలో బీజేపీలో చేరారు. 17వ డివిజన్ కార్పొరేటర్ వేముల కవిత చంద్రశేఖర్, 39వ డివిజన్ కార్పొరేటర్ మాసం గణేశ్ ఈ రోజు హైదరాబాద్‌కు విచ్చేసి బీజేపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. వారిద్దరికీ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కాషాయ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. నిన్న(శుక్రవారం) రాత్రి ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే 1 ఇండిపెండెంట్, మరో ఏఐఎఫ్‌బీ కార్పొరేటర్ కరీంనగర్ ఎంపీ కార్యాలయానికి విచ్చేసి బండి సంజయ్ సమక్షంలో పార్టీలో చేరిన సంగతి తెలిసిందే.



తాజాగా మరో ఇద్దరి చేరికతో బీజేపీ బలం 34కు చేరింది. ఎక్స్ అఫిషియో హోదాలో స్థానిక ఎంపీ బండి సంజయ్‌కు కూడా ఒక ఓటు ఉంటున్నందున మొత్తం బీజేపీ బలం 35కు చేరింది. వీరు గాకుండా మరో ఆరుగురు కార్పొరేటర్లు బీజేపీ నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీకి మేయర్ పదవి దక్కడం ఖాయమైంది. దీనిని దృష్టిలో ఉంచుకున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ కు చెందిన కార్పొరేటర్లు, ఇండిపెండెంట్ కార్పొరేటర్లు బీజేపీలో చేరే అంశంపై తర్జన భర్జన పడుతున్నారు. కరీంనగర్‌లో అభివృద్ధి పనుల కోసం కేంద్రం నుండి అధిక నిధులు వస్తుండటం, బీజేపీలో చేరితేనే తమ తమ డివిజన్‌లో ఎక్కువ అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు మరింత దగ్గర కావొచ్చనే భావనతో బీజేపీ ముఖ్య నేతలతో మంతనాలు జరుపుతున్నారు. కాంగ్రెస్ గత రెండేళ్ల పాలనలో కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడం...రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేకపోవడం...వంటి అంశాలను దృష్టిలో ఉంచుకున్న ఆయా కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరితే పెద్దగా ఒరిగేదేమీ ఉండదనే అభిప్రాయానికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీలో చేరే కార్పొరేటర్ల సంఖ్య అనూహ్యంగా పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి.

## పులా్వమా అమరవీరులకు టీఆర్పీ పార్టీ ఘన నివాళి

**సూర్య కరీంనగర్**




2019 ఫిబ్రవరి 14న పుల్వామాలో జరిగిన ఉగ్రదాడిలో అమరులైన సీఆర్పీఎఫ్ జవాన్లకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించి ఘన నివాళులర్పించారు. రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా నాయకత్వంలో రిటైర్డ్ ఆర్మీ జవాన్లతో కలిసి కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టి ఒక నిమిషం మౌనం పాటించారు. ఈ సందర్భంగా అఖిల్ పాషా మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో జవాన్లు ప్రాణత్యాగం చేయడం వల్లే ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని అన్నారు. అమరవీరుల త్యాగం ఎప్పటికీ మరవలేనిదని, వారి కుటుంబాలను ప్రభుత్వాలు అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఉగ్రవాదం మానవాళికి పెద్ద ముప్పని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్పీ జిల్లా అధ్యక్షురాలు గంగిపెల్లి అరుణ, రిటైర్డ్ జవాన్లు మరియు పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎక్స్‌ప్లోరికా పాఠశాలలో అట్టహాసంగా వార్షికోత్సవం

**సూర్య కరీంనగర్**

జ్యోతినగర్‌లోని పారమిత ఎక్స్‌ప్లోరికా పాఠశాల నిర్వహించిన "ఎబూలియెన్స్" వార్షికోత్సవ వేడుకలు రేకుర్తి రాజశ్రీ కన్వెన్షన్ హాల్‌లో కన్నుల పండుగగా జరిగాయి. పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా. ఈ. ప్రసాదరావు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు వ్యక్తిగత సంతోషం, ఆశ, నిస్వార్థ సేవ అనే అంశాలపై ఆకట్టుకునే ప్రదర్శనలు ఇచ్చారు. ప్రకృతి పరిరక్షణ, రైతుల జీవితం, సైనికుల సేవలు వంటి అంశాలు ప్రత్యేకంగా నిలిచాయి. ఈ సందర్భంగా డా. ప్రసాదరావు మాట్లాడుతూ పాఠశాల పిల్లల సమగ్ర అభివృద్ధికి వేదికగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్లు, ప్రిన్సిపాల్ శర్మిష్ఠ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## కేంద్రంలో కళ్యాణ సీత రామచంద్రస్వామి ఆలయంలో శివపార్వతుల కళ్యాణం

**సూర్య వీర్నపల్లి**



వీర్నపల్లి కేంద్రంలో ఆదివారం కళ్యాణ సీత రామచంద్రస్వామి ఆలయంలో శివపార్వతుల కళ్యాణం వేడుకలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ భక్త బృందం తెలిపారు. శివరాత్రి రోజు ఉదయం శివలింగానికి అభిషేకం స్వామివారి అర్చనలు ప్రత్యేక పూజలు నిర్వహించి శివపార్వతుల కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని అన్నారు.

## విద్యుదాఘాతంతో అగ్ని ప్రమాదం

**సూర్య, హుజూరాబాద్**



హుజురాబాద్ పట్టణంలోని రజక వాడలో కుమార్ అనే మున్సిపల్ కార్మికుడి ఇంట్లో శనివారం రాత్రి విద్యుదాఘాతంతో అగ్ని ప్రమాదం సంభవించింది. ఇంట్లో ఉన్న ఫ్రిడ్జ్ నుండి మంటలు వస్తుండడంతో గమనించిన కుమార్ కుటుంబ సభ్యులు వెంటనే భయపడి బయటికి వచ్చారు. కాగా అగ్నిప్రమాదంతో ఇల్లు, ఇంట్లో ఉన్న వస్తువులు భారీగా దగ్ధమయ్యాయి. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పుతున్నారు. నష్టం వివరాలు తెలియాల్సి ఉంది.

## పుల్వామా ఉగ్ర దాడి మృతులకు క్యాండిల్ ర్యాలీ

**సూర్య కరీంనగర్**

జమ్మూ కాశ్మీర్లో 14 ఫిబ్రవరి 2019లో ఉగ్రవాదుల దాడిలో సిఆర్పిఎఫ్ జవాన్లు 40 మంది మృతి చెందారు. మృతుల సంస్మరణకు కరీంనగర్ పట్టణంలో శనివారం తెలంగాణ ఎక్స్ సిఏపీఎఫ్ పర్సనల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గీత భవన్ చౌరస్తా వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తెలంగాణ చౌరస్తాలో సీఆర్పీఎఫ్ మృతి చెందిన జవాన్లకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిఏపీఎఫ్ పర్సనల్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వి బాబు ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య సత్యనారాయణ రెడ్డి ఇనుగుర్తి రమేష్ సభ్యులు పాల్గొన్నారు.



## పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన కాంగ్రెస్

**సూర్య సిరిసిల్ల టౌన్**



సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల ఫలితాలు కొంత బాధ కలిగించినప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా పార్టీ ప్రభంజనం సృష్టించిందని, ప్రజలంతా ప్రజా పాలన వైపే మొగ్గు చూపారని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్,రాష్ట్ర నాయకులు వైద్య శివ ప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బాలరాజ్ అన్నారు.సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నిన్నటి రోజు ప్రకటించిన మున్సిపల్ ఫలితాలలో ఆరుగురు కౌన్సిలర్ల ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఫలితాలు కొంత అసంతృప్తిని కలిగించినప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా ఏనుముల రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని కోరుకుంటూ పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించినదని అన్నారు.మున్సిపల్ ఎన్నికల్లో 10 సంవత్సరాలు మంత్రిగా ఉన్న కేటీఆర్ ను ఒక్క సిరిసిల్లకే పరిమితం చేసిన సిరిసిల్ల ప్రాంత ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.సిరిసిల్ల విజయాన్ని అడ్డుపెట్టుకొని ఇక్కడ బిఆర్ఎస్ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరికాదని రాష్ట్రవ్యాప్తంగా ఐదు కార్పొరేషన్ లో ఒక్క స్థానం బిఆర్ఎస్ కు రాలేదని అన్నారు. భవిష్యత్తులో బిఆర్ఎస్ కనుమరుగు అవుతుందని అన్నారు.గెలిచిన కాంగ్రెస్ కౌన్సిలర్లను పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు సాల్వాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆడెపు చంద్రకళ,బొద్దుల శ్రీనివాస్, కూరపాటి శ్రీశైలం,వెంగళ లీల లక్ష్మీ నరసయ్య, కల్లూరు చెందిన,నీలి రవీందర్,గోనె ఎల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజెన్లను కోఆప్షన్ మెంబర్లుగా నియమించాలి

**- సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్**

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

పిల్లల నిరాదరణకు గురవుతున్న వయో వృద్ధులకు ఆసరాగా నిలుస్తున్న తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా, డివిజన్ల ప్రతినిధులకు జిల్లా లోని మున్సిపాలిటీల్లో కో అప్షన్ మెంబెర్స్‌గా నియమించాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు విజ్ఞప్తి చేశారు. శనివారం అసోసియేషన్ జిల్లా కార్యా లయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా డే కేర్ సెంటర్ల ప్రారంభం సందర్భంగా మున్సిపల్ చట్టం మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీనియర్ సిటిజెన్లకు కో అప్షన్ మెంబెర్లుగా నియమిస్తామన్నారని, జిల్లాలోని జగిత్యాల, రాయికల్, మెట్‌పల్లి, కోరుట్ల, ధర్మపురి మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల ఎంపిక సందర్భంగా కో అప్షన్ మెంబర్ల నియామకాల్లో మా అసోసియేషన్ ప్రతినిధులకు ప్రాధాన్యత నివ్వాలని మంత్రిని, ఎమ్మెల్యేలను, పార్టీ ల భాద్యులను కోరారు. ఈ సమావేశం లో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరి శెట్టి విశ్వనాతం, కోశాధికారి ప్రకాష్ రావు, ఉపాధ్యక్షులు పి. సి. హన్మంత్ రెడ్డి,ఎం. డి. యాకూబ్, సత్యనారాయణ,బాలయ్య కోరుట్ల అధ్యక్షులు పబ్బా శివానందం, మెట్ పల్లి అధ్యక్షులు వొజ్జల బుచ్చి రెడ్డి, ధర్మపురి అధ్యక్షులు గంగాధర్, కరుణ,విజయలక్ష్మి, జిల్లా, డివిజన్, మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సీఎం కప్ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ కు ఎంపికైన క్రీడాకారులు

**సూర్య, సెంటినరీ కాలనీ**



మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన జిల్లా స్థాయి సీఎం కప్ బ్యాడ్మింటన్ పోటీల్లో గెలు పొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారుల వివరాలను అధికారులు వెల్లడించారు. జూనియర్, సబ్ జూనియర్ బాలబాలికల కు నిర్వహించిన పోటీల్లో జిల్లాకు చెందిన 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన అండర్-15 బాలికల విభాగంలో కె.ఆరాధ్య, ఎం.అఖిల్, ఎన్.వనిత, వంశిక దేవద, వై.సమన్విత ఉన్నారు. అండర్-19 విభాగంలో ఎం.పవిత్ర, ఎం.మైథిలి, టి.జోషిక, టి.సంజన, ఎన్.శృతిలు జిల్లా స్థాయిలో గెలిచి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. బాలుర అండర్-15 విభాగంలో వి.గౌతమ్ సాయి, ఎస్.జస్విత్, బి.సాయి చరణ్, ఆర్ .శ్రావణ్ కుమార్, టి.వరుణ సాయిలు జిల్లా జట్టుకు ఎంపికైనారు. అండర్-19 బాలుర విభాగంలో కె.నందన్, కె.వరుణ్ ప్రసాద్, పి. చిరంజీవి చారి,పి.భరత్ చంద్ర రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.ఉదయ్ కుమార్ అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి జిల్లా ఖ్యాతిని రాష్ట్రానికి ఇనుమడింప చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు పింగళి కృష్ణారెడ్డి, జి.సునీల్ కుమార్, ఎ.విజయ్ కుమార్, వల్లంభట్ల శ్రీనివాస్, సమ్మయ్య, పెటా అధ్యక్షుడు వేల్పుల సురేందర్, తదితరులు పాల్గొన్నారు.